ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 30.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 280 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

విజయ్ హజారే ట్రోఫీలో మరో మ్యాచ్‌కు కోహ్లీ రెడీ 8

వారం పాటు అసెంబ్లీ

బీఏసీ సమావేశంలో నిర్ణయం

జనవరి 1 వరకు సమావేశాలకు విరామం

- 15 రోజులు కొనసాగించాలి: బీఆర్ఎస్ పట్టు
- 32 అంశాలపై చర్చించాలని కోరాం: బీజేపీ
- ఇద్దరు దివంగత ఎమ్మెల్యేల సంతాప తీర్మానం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్29: తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు వారం రోజుల పాటు కొనసాగాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు వాయిదా అనంతరం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ(బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. బీఆర్ఎస్‌నుంచి హరీశ్ రావు, బీజేపీ పక్ష నేత

...:: మిగతా 2లో

కేవలం ఐదు నిమిషాలే

- అసెంబ్లీ నుంచి వెళ్లిపోయిన కేసీఆర్
- మర్యాదపూర్వకంగా పలకరించిన సీఎం రేవంత్ ...:: 2లో

మంత్రులంతా సభకు రావాల్సిందే

- బీఆర్ఎస్‌ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది
- ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలి
- సభలో పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యం
- సీఎం రేవంత్ రెడ్డి ...:: 2లో

నదీ జలాలపై బండారం బయటపెడతాం

ఎవరి హయంలో ఏం జరిగిందే వివరిస్తాం

- హరీశ్ రావువి దిగజారుడు మాటలు
- ఇరిగేషన్‌లో తానే మాస్టర్ గా హరీశ్‌చిత్రీకరణ
- అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోంది
- కృష్ణాబేషన్ పై అసెంబ్లీలో ప్రజెంటేషన్‌కు సిద్ధం
- బీఆర్ఎస్‌తప్పడు ప్రచారంపై మంత్రి ఉత్తమ్ కుమార్ మండిపాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబరు 29 : తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశంలో సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకు? అని ప్రశ్నించారు.

నదీ జలాలపై బండారం బయటపెడతామని, ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీలు డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని హరీశ్‌రావు దుష్ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ట్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తా? అని ప్రశ్నించారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపేర్కొన్నారు .

బీఆర్ఎస్ చేతకాని తనాన్ని తమపై రుద్దొద్దు

బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని ఉత్తమ్ హితవు పలికారు. వారు ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాగునీటి జలాలపై డీపీఆర్‌ను కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్ పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. హరీశ్‌రావును చూసి గోబెల్స్ కూడా సిగ్గుతో తలదించుకుంటారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డిలో 90 టీఎంసీలకు ప్రతిపాదించారని గుర్తుచేశారు. 45 టీఎంసీల మైనర్ ఇరిగేషన్,

...:: మిగతా 2లో

నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు

పోలీస్ కమిషనరేట్ల పునర్ వ్యవస్థీకరణ

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ

- కమిషనరేట్ల పరిధి నుంచి భువనగిరి జిల్లా మినహాయింపు
- విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్‌బాబు
- మల్కాజ్‌గిరి సీపీగా అవినాష్ మహంతి
- సైబరాబాద్ సీపీగా రమేశ్‌రెడ్డి
- యాదాద్రి జిల్లా ఎస్పీగా అక్షాంశ్‌యాదవ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబరు 29 : పునర్ వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీతో పాటు ఫ్యూచర్ సిటీతో కలిపి పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా

...:: మిగతా 2లో

నర్సింగ్ హోమ్‌లో అగ్నిప్రమాదం

16 మంది సజీవ దహనం.. ఇండోనేషియాలో దుర్ఘటన

ఇండోనేసియాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సులవేసి ద్వీపంలోని ఓ నర్సింగ్ హోమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 16 మంది సజీవదహనమయ్యారు. మరికొంతమంది గాయపడ్డారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వెర్ద దమై రిటైర్మెంట్ హోమ్‌లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌లోని వృద్ధులు విశ్రాంతి తీసుకుం టున్నారు. మంటల ధాటికి వారు తమతమ గదుల్లోనే సజీవదహనమయ్యారు.

...:: 7లో

నీళ్లపై రాజీపడుతున్న కాంగ్రెస్

కేసీఆర్‌కు పేరు వస్తుందనే 'పాలమూరు' పక్కకు పెట్టారు

- కాళేశ్వరం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం
- ప్రాజెక్టులపై అవగాహన లేని పాలకులు చర్చలు కోరుతున్నారు
- నీటిపారుదల సబ్జెక్ట్ చదివితే రాదు.. రాష్ట్రంపై ప్రేమ ఉండాలి
- సర్పంచ్ ఎన్నికలే కాంగ్రెస్ పాలనకు రిఫరెండం
- ప్రజలు కాంగ్రెస్ పరిపాలనను తిరస్కరించారు
- డబ్బుల కోసమే జీహెచ్ఎంసీ విభజన
- అడ్డగోలుగా డిలిమిటేషన్ చేస్తున్నారు
- టెలిఫోన్ ట్యాపింగ్, సిట్ డ్రామాలతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- శాసన సభలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 29: ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతోనే, తన పాత బాస్ చంద్రబాబు నాయుడికి కోపం వస్తుందనే పాలమూరు ప్రాజెక్టును రేవంత్ రెడ్డి పక్కన పెట్టారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. శాసన సభ ఆవరణలో మీడియాతో జరిగిన చిట్ చాట్ లో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని పలు కీలక అంశాలపై విస్తృతంగా స్పందించారు. ముఖ్యంగా పాలమూరు ప్రాజెక్టు, నీటిపారుదల అంశాలు, శాసన సభలో జరుగుతున్న చర్చలు, జీహెచ్ఎంసీ విభజన, టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు, కేసీఆర్‌ను కలవడంపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు, మీసాలు-గడ్డాలపై చేసిన వ్యాఖ్యలపై తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు.

పాలమూరు ప్రాజెక్టు – అసెంబ్లీలో చర్చపై కేటీఆర్

ఏ ప్రభుత్వం అయినా ముందుగా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులను ప్రారంభిస్తుందని, అనంతరం అన్ని అనుమతులు తెచ్చుకోవడం పరిపాటేనని కేటీఆర్ తెలిపారు. అయితే ఈ విషయాన్ని ఎవరూ బయటకు చెప్పరని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు గురించి 70 ఏండ్ల నుంచి వింటున్నామని, కానీ ఇప్పటికీ అది పూర్తి కాలేదని గుర్తుచేశారు. అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం తమ నాయకుడు కేసీఆర్ హయాంలోనే

...:: మిగతా 2లో

ఉన్నావ్ నిందితుడి బెయిల్ పై సుప్రీం స్టే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీమ్ ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అత్యాచార కేసులో.. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్ కు ఢిల్లీ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇద్దరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఇదే విషయమై.. సీబీఐ కూడా సర్వోన్న న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్లు వేసింది. కుల్దీప్ బయటకు వస్తేకేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది. ఈ వ్యాజ్యంపై సీజేఐ సూర్యకాంత్ న్యాయమూర్తులు జేకే.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం..సోమవారం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం. అయితే.. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. సెంగార్‌కు పోక్సో చట్టం వర్తించదని.. ఢిల్లీ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

ఆరావళి పర్వతాల కేసులో సుప్రీం విచారణ

ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ జరిగింది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు పేర్కొంది,

7

ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య కీలక భేటీ జరిగింది. ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగోరో నివాసంలో జెలెన్స్కీ, ట్రంప్ షేక్ హ్యాండ్ ఇచ్చుకొని గంటన్నర పాటు చర్చలు జరిపారు.

7

ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన బస్సు

ముంబై నగరంలో ఓ బస్సును రివర్స్ చేస్తుండగా అది పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు పాదచారులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

7

ఎన్నికల కోసం కలిసిన పవార్ కుటుంబం

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పవార్‌ల కుటుంబం జట్టు కట్టింది. పింప్రి-చించ్వాడ్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఎన్సీపీ, ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు కలిసికట్టుగా పోటీ చేయబోతున్నాయి.

7

రాజకీయం

కేవలం ఐదు నిమిషాలే..

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 29: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనమయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు కేసీఆర్. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు.

నదీ జలాలపై బండారం బయటపెడతాం

మొదటిపేజీ తరువాయి

45 టీఎంసీల గోదావరి డైవర్షన్ అని వాడారని చెప్పుకొచ్చారు. వాళ్లు ఇచ్చిన జీవోనే తాము ప్రస్తావిస్తూ లేఖ రాశామని స్పష్టం చేశారు. తొలుత మైనర్ ఇరిగేషన్‌ను క్లియర్ చేయమని అడిగామని అన్నారు. పేజ్ 1లో ఇన్షియల్‌గా చేయమని అడిగామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టులో 7 టీఎంసీలకు ఒప్పుకుని వచ్చారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తిచేయలేకపోయారని ప్రశ్నించారు. తాము మాత్రం పూర్తిచేసి పాలమూరు ప్రాంతానికి నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

నాలుగు పోలీస్ కమిషరేట్లు ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

విభజన చేశారు. వీటి పరిధి నుంచి భువనగిరిని మినహాయించారు. మరోవైపు పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేశారు. ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్‌బాబు, మల్కాజ్‌గిరి సీపీగా అవినాష్ మహంతి, సైబరాబాద్ సీపీగా రమేశ్ రెడ్డి, యాదాద్రి జిల్లా ఎస్పీగా అక్షాంశ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేయడం జరిగింది. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దేందుకు పలు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి, ప్రతీ ప్రాంతానికి ఒక ప్రత్యేక వ్యూహం, ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి అతి ముఖ్యమైన ఓఆర్ఆర్ లోపలి 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలుపుతూ చట్టపరమైన మార్పులు చేసింది. ఈ వ్యూహం ద్వారా ఈ ప్రాంతంలో ఒక ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంది. జీహెచ్ఎంసీ ప్రాంతాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్ వ్యవస్థీకరించారు. ఇదే విధంగా ఇతర శాఖలను పునర్ వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రజలకు మెరుగైన సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగాంగా పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న మూడు కమిషనరేట్లను పునర్ వ్యవస్థీకరిస్తూ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, బేగంపేట, శంషాబాద్ ఎయిర్ పోర్టు, బుద్వేల్ హైకోర్టు లాంటి కీలక ప్రాంతాలను హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ ప్రాంతాలు గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్ రామ్ గూడ, మాదాపూర్, రాయదుర్గ్, పారిశ్రామిక ప్రాంతాలు పఠాన్ చెరు, జీనోమ్ వ్యాలీ, RC పురం, అమీన్ పూర్ తదితర ప్రాంతాలు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండనున్నాయి. రాచకొండ కమిషనరేట్‌ను పునర్ వ్యవస్థీకరించి మల్కాజ్ గిరి పేరుతో కొత్త కమిషనరేట్ ను ఏర్పాటు చేశారు. కీసర, శామీర్ పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి తదితర ప్రాంతాలు ఈ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయి. ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో ఉన్న భువనగిరిని ప్రత్యేక పోలీస్ యూనిట్ గా ఏర్పాటు చేసి యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమించనున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి తీసుకు వచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు కమిషనరేట్లకు పోలీస్ కమిషనర్లను, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగుల గురించి హరీశ్ మాట్లాడడం విడ్డూరం

- సభలో హరీశ్ రావు వర్సెస్ శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29: అసెంబ్లీ జీరో అవర్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వ ఉద్యోగుల గురించి ప్రస్తావించిన అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్ రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని హరీశ్ రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. జీరో అవర్ లో సభ్యుల విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకుంటామన్నారు. అంతకు ముందు హరీశ్ రావు సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర మనోవేదనలో ఉన్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్ లో ఉన్నది మన తెలంగాణలోనే అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయిన ఇంత వరకు పీఆర్సీ ఇవ్వలేదని వెంటనే పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ పై తాము జీవో తీసుకువస్తే దీన్ని అమల్లోకి తెస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిందని దాన్ని వెంటనే అమల్లోకి తేవాలన్నారు. ఉద్యోగులకు జీపీఎఫ్ తదిర బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడంతో 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు వైద్యం కూడా చేయించుకోలేక మరణించారని హరీశ్ రావు ఆరోపించారు. సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్ ఉద్యోగులుగా మారుస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు చేయలేదని, గడిచిన రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన కాంట్రిబ్యూషన్ డబ్బులను ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. పోలీసు శాఖలో ఐదు సరెండర్ లీవ్ లు పెండింగ్లో ఉన్నాయి. టీఏ, డీఏ, స్టేషన్ అలవెన్స్ లు రావడం లేదన్నారు. పోలీసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఆరోగ్యభద్రతను పునరుద్ధరించాలని కోరారు.

తెలంగాణ వాదులంటే కేసీఆర్‌కు ప్రేమలేదు

- తెలంగాణలో కేసీఆర్ పాత్రే లేదు
- హాస్పిటల్లో దీక్ష చేయడం ఏంటి?
- కేసీఆర్ ఏ ఇంజక్షన్లు, ఎన్ని తీసుకున్నాడో నా దగ్గర లిస్ట్ ఉంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29: సంతాపాలు చదువుతుంటే కేసీఆర్ వెళ్లిపోయారని, తెలంగాణ వాదులంటే కేసీఆర్ కి ప్రేమలేదని, కేవలం 3నిమిషాల కోసం అసెంబ్లీకి వచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మౌనం పాటించే వరకు ఉండాలి కదా, 30 ఏళ్లు సభలో ఉన్న సభ్యులు చనిపోతే సంతాపం తెలుపుతుంటే వెళ్లిపోవడం ఎంత వరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పెద్దోడు ఆయనికి చెప్పే వాళ్లము కాదని, కానీ ఇంకోసారి ఇలాంటి తప్పు చేయకపోతే బాగుంటుందన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాత్రే లేదు.చావునోట్లోకి వెళ్ళి వచ్చాను అంటున్నారు, శ్రీకాంతాచారి ఎందుకు బయటికి రాలేదన్నారు. నేను తెలంగాణ కోసం దెబ్బలు తిన్న, రబ్బర్ బుల్లెట్ తగిలిందని మంత్రి తెలిపారు. మరి కేసీఆర్ కి ఏమి తగిలిందని ప్రశ్నించారు. నేను నిరాహార దీక్ష చేసి 17 కేజీలు తగ్గానని, చనిపోతారని చెప్పారని అన్నారు. హాస్పిటల్లో దీక్ష చేయడం ఏంటి? కేసీఆర్ ఏ ఇంజక్షన్లు తీసుకున్నాడో, ఎన్ని తీసుకున్నాడో నా దగ్గర లిస్ట్ ఉందని మంత్రి తెలిపారు.

వారం పాటు అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి

మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు.

15 రోజులు సమావేశాలు

జరపాలని పట్టుపట్టాం: హరీశ్ రావు

బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామన్న స్పీకర్ చెప్పారని హరీశ్వర్‌రావు తెలిపారు. అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్ కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు (కాంగ్రెస్ ప్రభుత్వం) ఇవ్వకపోతే మేము బహిష్కరించాలా అని అడిగామని హరీశ్ తెలిపారు.

32 అంశాలపై చర్చించాలని కోరాం: మహేశ్వర్ రెడ్డి

శాసనసభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని సమావేశంలో కోరామని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు. జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు. "రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైల్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్ ఫిక్సింగ్‌కు ప్రయత్నిస్తోందని ఏలేటి ఆరోపించారు. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం అని "ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దివంగత ఎమ్మెల్యేలకు

సభ సంతాపం

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయిన వెంటనే స్పీకర్ దివంగత ఇద్దరు ఎమ్మెల్యేల సంతాప తీర్మాణం ప్రవేశ పెట్టారు. తొలి రోజు శాసనసభ సమావేశాల సందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను శాసన సభ స్పీకర్ సభలో ప్రవేశ పెట్టారు. అనంతరం సభ్యులందరూ సంతాపాన్ని తెలిపారు. అనంతరం జీరో అవర్ లో తమ తమ నియోజకవర్గాలకుచెందిన సమస్యలపై సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

మంత్రులంతా సభకు హాజరవ్వాల్సిందే

- బీఆర్ఎస్ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది
- ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలి
- సభలో పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యం
- సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 29: శాసన సభకు మంత్రులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని అన్నారు. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు అమాత్యులు సిద్ధంగా ఉండాలన్నారు. సభలో పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యమన్న ఆయన ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. సీఎం రేవంత్‌తన ఛాంబర్ లో మంత్రులు, విప్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా నీటివాటల విషయంలో మంత్రులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సీఎం రేవంత్ తెలిపారు. సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధం కావాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యం అని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని సీఎం తెలిపారు.

కేసీఆర్ తో సీఎం కరచాలనం

అసెంబ్లీ లో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు.

కేసీఆర్ తో తాను మాట్లాడింది మేకెందుకు చెబుతా

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలియదని, ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆపై వేరే విషయాలపై మీడియాతో సీఎం మాట్లాడుతూ.. అసెంబ్లీ లాబీని పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులకు యాక్సెస్ కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యేలలకు సెంట్రల్ హాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల వరకు మండలిని పూర్తి చేయాలని అనుకుంటున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీడియాతో చిట్ చాట్ అనంతరం అసెంబ్లీలోని తన ఛాంబర్‌కు చేరుకున్నసీఎం.. మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో భేటీ అయ్యారు.

నీళ్లపై రాజీపడుతున్న కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

పూర్తయిందని, దీనికి కారణం కేసీఆర్ నిబద్ధతే అని స్పష్టం చేశారు. కాలంతో పోటీ పడి మరీ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. కాలేశ్వరంలో రంధ్రాన్వేషణ చేస్తే రాష్ట్రానికి నష్టం జరుగుతుందే తప్ప రాజకీయంగా తమకు నష్టం జరగదని అన్నారు. ప్రజలకు నీళ్లు ఇచ్చింది ఎవరో ప్రజలకు బాగా తెలుసని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో 45 టీఎంసీలకు ఒప్పుకుంటే అది నష్టమే అవుతుందని, 299 టీఎంసీలకు ఒప్పుకున్నది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. దాని ఆధారంగానే తమ ప్రభుత్వం మరిన్ని నీటి కేటాయింపుల కోసం కేంద్రాన్ని కోరిందన్నారు. అయినప్పటికీ పాలమూరు ప్రాజెక్టును రేవంత్ రెడ్డి కావాలనే పండబెట్టాడని ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతోనే, తన పాత బాస్ చంద్రబాబు నాయుడికి కోపం వస్తుందన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును అడ్డుకుంటున్నాడని కేటీఆర్ విమర్శించారు. కృష్ణా నదినుంచి నీళ్లు తీసుకుంటే చంద్రబాబుకు కోపం వస్తుందని, అందుకే ప్రాజెక్టును పండబెట్టి కాలువలు కూడా తవ్వడం లేదన్నారు. రేవంత్ రెడ్డి అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయనే కారణంతోనే ఆయన బూతులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. తనపై వ్యాఖ్యలు చేస్తే తాను స్పందించనని, కానీ తన తండ్రి కేసీఆర్‌పై మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రేవంత్ బూతులకు తాను స్పందిస్తే తన స్థాయికి దిగజారొద్దని కొందరు చెబుతున్నారని అన్నారు. నీళ్ల గురించి ప్రశ్నిస్తే నికృష్టమైన మాటలు మాట్లాడుతున్నారని, కేసీఆర్ ప్రెస్ మీట్‌కే కాంగ్రెస్ నాయకులు అల్లాడిపోతున్నారని చెప్పారు. మీడియా ముందు కెసిఆర్ గారు లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పలేక బూతులు మాట్లాడుతున్నది అన్నారు. అలాంటప్పుడు కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. నీళ్ల సబ్జెక్ట్ నాలుగు రోజులు చదివితే రాదని, రాష్ట్రంపై ప్రేమ ఉండాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కృష్ణా నది ఏ బేసిన్‌లో ఉందో, ఎక్కడ ఉందో కూడా అడిగిన పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. బాక్రా నంగల్ ఏ రాష్ట్రంలో ఉందో కూడా తెలియని ముఖ్యమంత్రి ఉన్నారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తే ఈరోజు నీటిపారుదల శాఖ సలహాదారుడిగా ఉన్నారని అన్నారు. ఇలాంటి వారు నీటిపారుదల శాఖపై చర్చ కోరుతున్నారని, అసలు దేనిపై చర్చ పెడుతున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. నీటిపారుదలపై కనీస అవగాహన లేని వారు కేసీఆర్ చర్చకు రావాలని అంటున్నారని విమర్శించారు. కేసీఆర్ వస్తున్నారన్న మాట వినగానే కాంగ్రెస్ నాయకులు చర్చకు ప్రిపేర్ అవుతున్నారని చెప్పారు. కౌశిక్ రెడ్డి సభలో మేడిగడ్డను ఎవరో బాంబులు పెట్టి పేల్చారని స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. బూతులు మాట్లాడాలంటే ఎన్ని రోజులైనా సభ నడుపుతారని, కానీ సబ్జెక్ట్ లేనప్పుడు సభను ఎక్కువ రోజులు నడపలేరని వ్యాఖ్యానించారు. చెక్ డ్యాం పేల్చివేత కేసులో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ ఉన్నదని, మేడిగడ్డ పేల్చారని ఇంజనీర్లు ఆనాడే ఫిర్యాదు చేశారని చెప్పారు. అయినా ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు.

జీహెచ్ఎంసీ విభజన శాస్త్రీయంగా ఉండాలి

జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజిస్తారన్న ప్రచారం జరుగుతోందని, ఫోర్త్ సిటీ అని పెట్టిన దానిని కూడా కార్పొరేషన్ చేస్తారేమోనని అన్నారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలని, ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకోబోమని, అన్నింటికీ సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. చర్చ పెట్టాలని, ఆ చర్చలో తమ పార్టీ అన్ని విషయాలు మాట్లాడుతుందని చెప్పారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం ఏం చేసుకుంటారో, ఎవరికీ లాభం చేకూర్చేలా చేసుకుంటారో వారి ఇష్టమని వ్యాఖ్యానించారు. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలు చరిత్రాత్మకమని, అటువంటి ఎన్నికలను ఇప్పటివరకు చూడలేదని, మళ్లీ చూడబోమని అన్నారు. కేవలం డబ్బుల సేకరణ కోసం మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్లు చెప్పినట్లు డిలిమిటేషన్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విభజన మొత్తం డబ్బుల కోసమేనని, అడ్డగోలుగా విభజన చేశారని విమర్శించారు. గతంలో ఓల్డ్ సిటీలో కూడా తమ పార్టీ రెండో స్థానంలో నిలిచిందని, గతంలో తాము గెలిచిన సీట్లను భవిష్యత్తులో ఎవ్వరూ గెలవలేరని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలు

కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని, తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో శాసన సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని వ్యాఖ్యానించారు. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుంటుందని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదని కేటీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు

- 5.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా
- గత సీజన్ కంటే అధికంగా అమ్మకాలు
- ఐదు జిల్లాల్లో ఫెర్టిలైజర్ యాప్ విజయవంతం
- 9 రోజుల్లో 2,01,789 బస్తాల కొనుగోలు
- సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానీయద్దు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29: రబీ సీజన్ కోసం అవసరమైనంత యూరియా నిల్వ రాష్ట్ర ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపణీలపై చీఫ్ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీలతో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు. గత సంవత్సరం ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్‌లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని, ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వగా ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ (యూరియా) యాప్‌ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో డిసెంబర్ 20 నుండి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఐదు జిల్లాల్లో 82,059 మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసి 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారని తెలిపారు. యాప్ ప్రారంభించిన కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22,000కు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. యాప్ అమలులో ఉన్న జిల్లాలు కాని, అమలులో లేని జిల్లాలలో కాని యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. యూరియా పంపిణీపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్లో టోల్ ఫ్రీ నెం. 18005995779 ఏర్పాటు చేయడమైనదని తెలియజేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, కోఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

“

ప్రజలు ఎన్నుకున్న సీఎంలా కాకుండా, ప్రైవేటు వ్యక్తుల ప్రతినిధిలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లు.. ఇలా అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తున్నారు. పీపీపీ ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవచ్చని చెప్పడం దారుణం. రానున్న రోజుల్లో పరిపాలనను కూడా ప్రైవేటుపరం చేస్తారేమో.

- ఏపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

రాష్ట్రీయం

పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళిక

- కేరళ మాదిరి రాష్ట్రంలో పేదల గుర్తింపు
- రాష్ట్ర మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క
- ప్రజా భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29 : ప్రజా భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్‌సీఈఓ దివ్య దేవరాజన్ తో కలిసి జిల్లాల వారీగా గత నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను మంత్రి సీతక్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలు నూతన లక్ష్యంతో, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు మహిళా సంఘాలు తమను తాము అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాయని, ఇకపై వారి బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. కేరళ తరహాలో అత్యంత పేదరికంలో ఉన్నవారిని గుర్తించడంలో గ్రామైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అత్యంత పేదరికంలో ఉన్న "పూరెస్ట్ ఆఫ్ ద పూర్"ను టార్గెట్‌గా గుర్తించి, వారిని ఆ స్థితి నుంచి బయటకు తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అత్యంత వెనుక బాటలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలను అర్థం చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తే.. టార్గెట్ గా వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు ఇప్పటివరకు అందని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేరళలో అత్యంత పేదరికాన్ని నిర్మూలన ఎలా చేపట్టారో మహిళా సంఘాలకు మంత్రి సీతక్క వివరించారు. అక్కడ సర్వే ద్వారా 64,006 అత్యంత పేద కుటుంబాల్లో సుమారు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నవారిగా గుర్తించారని చెప్పారు. అదేవిధంగా తెలంగాణలో కూడా అత్యంత పేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు మైక్రో ప్లాన్ను రూపొందిస్తామని చెప్పారు. ఆయా కుటుంబాలకు కేరళా తరహాలో గుర్తింపు కార్డులు, ఇళ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ వంటి సహాయాలను అందిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, స్వరూపలను మంత్రి సీతక్క సన్మానించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న సెర్ప్‌ను అభినందించారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్

- బడ్జెట్ ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 29 : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. విలీన పురపాలికలతో కలిపి సిద్ధం చేసిన రూ.11,460 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను రానున్న కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంతో పాటు 10వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి డ్రాఫ్ట్ బడ్జెట్ ప్రతిపాదనలు, అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌పై విస్తృతంగా చర్చించి ఆమోదం తెలిపారు. మొత్తం 15 ఎజెండా అంశాలు, 7 అదనపు అంశాలపై చర్చించి అన్నింటికీ ఆమోదం తెలిపారు. ఇందులో శ్మశానవాటికల అభివృద్ధి, డ్రెయినేజీ పనులు, విస్తృత రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలు, సిబ్బంది పోస్టుల భర్తీ, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఏఐ ఆధారిత సేవల అమలు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు, సిఎస్ఆర్ కింద పార్కులు, మీడియన్లు, ఫ్లైఓవర్ల నిర్వహణ వంటి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే వార్డు సభ్యుల అధ్యయన పర్యటన, వివిధ లీజు భూముల పొడిగింపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు టెండర్-కమ్-పబ్లిక్ వేలం నిర్వహణ, హైదరాబాద్ స్కల్ప్చర్ పార్క్ ఏర్పాటు వంటి అంశాలకు కూడా ఆమోదం లభించింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు , వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డను బాంబులతో కూల్చేశారు

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు
- ఖండించిన కాంగ్రెస్‌పార్టీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 29: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కృంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

ఉద్యమాన్ని నడిపించింది మాట–పాటే

- ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 29: తెలంగాణ ఉద్యమాన్ని నడిపించింది మాట-పాటే అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వకుండా అన్యాయం జరిగిందని తెలంగాణ ఉద్యమ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఉద్యమ కళాకారులు కలిశారు. ఈ సందర్భంగా కళాకారులు తమ సమస్యలను కవిత దృష్టికి తీసుకెళ్లారు. సాంస్కృతిక సారథిలో అర్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగాలు కల్పించలేదని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కవిత, తెలంగాణ ఉద్యమం విజయవంతం కావడంలో మాటతో పాటు పాట కూడా కీలక పాత్ర పోషించిందని అన్నారు. పెద్దలు తమ వాదనలతో ఉద్యమ అవసరాన్ని వివరించగా, కళాకారులు ఊరూరా గజ్జె కట్టుకుని ప్రచారం చేయడం వల్లే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని ఆమె గుర్తు చేశారు. ఉద్యమ ఆకాంక్షను నిలబెట్టింది తెలంగాణ పాటేనని, వేలాది మంది కళాకారులు గ్రామగ్రామాన తిరుగుతూ ఆడిపాడారని కవిత పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 550 మందికి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. అదే స్థాయిలో అర్హతలు ఉన్నప్పటికీ ఇంకా ఉద్యోగాలు రాని కళాకారులు ఉన్నారని, వారందరికీ ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ జాగృతి పక్షాన డిమాండ్ చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం చేపట్టే ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తామని కవిత హామీ ఇచ్చారు. కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద కళాకారులు చేపట్టే ఆందోళనలో తాము పాల్గొంటామని కవిత తెలిపారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు సన్నాహాలు

- 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఓటరు జాబితా సవరణకు నోటిఫికేషన్ విడుదల

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, డిసెంబర్29: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత స్థాయిలో సన్నాహాలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఓటరు జాబితా సవరణకు సంబంధించి అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎస్ఈసీ ప్రకటన ప్రకారం డిసెంబర్ 30 నుంచి జనవరి 10 వరకు ఓటరు జాబితా తయారీ, సవరణ ప్రక్రియ కొనసాగనుంది. ఈ సమయంలో కొత్తగా అర్హత పొందిన ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు, అర్హత లేని ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ప్రధానంగా కొత్తగూడెం, కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఎన్నికల అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్న ఎన్నికల సంఘం, అర్హులైన ప్రతి పౌరుడు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించింది. ఏవైనా లోపాలు ఉంటే నిర్ణీత గడువులోపు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించాలని కోరింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ ప్రక్రియకు ప్రాధాన్యం సంతరించుకుంది.

పారిశుధ్యంపై ఫోకస్ పెంచాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 29: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం నుంచి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు నగర వ్యాప్తంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టి క్లీనింగ్ చేపట్టింది. క్షేత్రస్థాయిలో సానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ ను జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు మానిటర్ చేశారు. కిస్మత్ పూర్, నార్సింగి, సన్ సిటీ లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రభావవంతం గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ఫ్లై ఓవర్లు ,రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు,చెరువులు, నాలాలు,ఫుట్‌పాత్‌లు, పార్కులు , నిర్మాణ-కూల్చివేత, వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు.

సీఎం సూచనలతో జూబ్లీహిల్స్ అభివృద్ధికి కృషి

- అసెంబ్లీలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే తొలి స్పీచ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29: ఇటీవల నిర్వహించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచిన నవీన్ యాదవ్ తొలిసారి ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో తన మొదటి స్పీచ్లో ప్రజా సమస్యలపై మాట్లాడారు. 'నాకు అవకాశం ఇచ్చి గెలిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. గత రెండు ఏళ్ల క్రితం అసెంబ్లీలో సీఎం తన పేరును ప్రస్తావించారు. రెండేళ్లలోపే తోటి సభ్యుడిగా సభలో రావడం చాలా గౌరవంగా భావిస్తున్నాను. సీఎం రేవంత్ రెడ్డి సూచన సలహాలతో మా జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకు పోవడానికి కృషి చేస్తాను. ఈ సందర్భంగా సభ మర్యాదలను పాటిస్తూ సభను గౌరవిస్తూ ముందుకు సాగుతాను' అని వ్యాఖ్యానించారు. తన నియోజకవర్గ సమస్యల గురించి నవీన్ మాట్లాడుతూ.. వర్షంతో కృష్ణానగర్ మునిగిపోతుంది.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో హై టెన్షన్ లైన్ తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పదుల సంఖ్యలో మరణాలు చోటు చేసుకున్నాయని ఈ సమస్యలను పరిష్కరించాలని, తన ప్రాంతంలో ఇంటర్, డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు.

సింగారపు చెరువు జోలికి వస్తే చర్యలు

- తహసీల్దార్ గౌతమ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 29 : సింగారపు చెరువు జోలికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కాశీంబౌలి అనుబంధ గ్రామమైన నదీమ్ నగర్ రెవెన్యూ పరిధిలోని సింగారపు చెరువులో వండుమట్టి తొలగించడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువు కట్ట జోలికి వస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు.చెరువు కట్ట పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎవరూ చెరువు కట్టలో అక్రమంగా చర్యలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ భరత్ కుమార్, సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి,అమ్డాపూర్ జీపీవో రాజేష్, వర్క్ ఇన్ స్పెక్టర్ నర్సింలు, కౌశింబౌలి గ్రామస్తులు తదితరులున్నారు.

హిందూ ధర్మంపై తప్పడు ప్రచారాలు

- ఇలాంటి వారికి అఖండ -2 గుణపాఠం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్29 : ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈసినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని ఆయన తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 తాండవం' సినిమాను బండి సంజయ్ వీక్షించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్‌తో సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్‌తో కలిసి ఈ సినిమాను చూశారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'అఖండ 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా చూపించిన సినిమా అఖండ 2. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవారే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ 2 తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడుపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలని అఖండ2 చెబుతోంది' అని బండి సంజయ్ ప్రశంసించారు.

సంజీవ్ కుమార్ కుటుంబనికి మంత్రి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 29: మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కమాండర్ సంజీవ్ కుమార్ కి మంత్రి వాకిటి శ్రీహరి నివాళులు అర్పించారు. సంజీవ్ కుమార్ ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.

పుతిన్ నివాసంపై దాడికి యత్నించారన్న రష్యా ఆరోపణలు అంతా అబద్ధం. ఉక్రెయిన్‌పై చేస్తున్న దాడులను సమర్థించుకునే కల్పితకథ. ట్రంప్ టీమ్‌తో కలిసి మేం సాధించిన దౌత్య ప్రయత్నాల విజయాలను దెబ్బతీసేందుకు రష్యా ప్రమాదకర ప్రకటనలు చేస్తోంది. యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి నిరాకరిస్తోంది.
- ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీ

ఓపెన్ వాయిస్

కాంగ్రెస్‌ను ఇరుకున పెడుతున్న ప్రశంసలు

జాతీయ కాంగ్రెస్ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బయటి శత్రువుల కంటే, పార్టీ అంతర్గత నేతల వైఖరే అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఆరెస్సెస్, బీజేపీలపై ప్రశంసలు గుప్పించే కాంగ్రెస్ నేతల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటం కాంగ్రెస్‌పార్టీ హైకమాండ్‌కు కొత్త తలనొప్పిగా మారింది. కొన్ని రోజుల క్రితం ఆరెస్సెస్‌పై డీకే శివకుమార్ ప్రశంసలు చేయగా.. గత కొంతకాలంగా శశిథరూర్ కూడా బీజేపీని పొగుడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆరెస్సెస్‌ను పొగుడుతూ దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ సంచలనంగా మారింది. దీంతో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిగా ముద్రపడిన దిగ్విజయ్ సింగ్, హఠాత్తుగా ఆ సంస్థ పనితీరును ఉదాహరణగా చూపడం రాజకీయవర్గాల్లోనే కాక, సొంత పార్టీలోనూ పెను దుమారం రేపుతోంది. ఉపాధి హామీ పథకం పేరు మార్పు అంశంపై కేంద్రంపై పోరుకు సిద్ధమవుతూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కానున్న తరుణంలో దిగ్విజయ్ సింగ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. "ఆర్ఎస్ఎస్‌లో నాయకుల పాదాల వద్ద కూర్చున్న ఓ సామాన్య కార్యకర్త.. రాష్ట్రానికి సీఎంగా, దేశానికి ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ఉన్న సంస్థాగతమైన శక్తి" అంటూ ప్రధాని మోడీ ఫోటోను జత చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్ష ప్రశంసల్లా ధ్వనించాయి. నిజానికి దిగ్విజయ్ ఉద్దేశం.. కాంగ్రెస్ పార్టీ కూడా సంస్థాగతంగా అంత బలంగా తయారుకావాలని చెప్పడమే కావచ్చు. ఆ తర్వాత ఆయన.. "నేను ఆర్ఎస్ఎస్, బీజేపీలకు బద్ధ వ్యతిరేకిని" అని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన సమయంలో, వారి సంస్థాగత నిర్మాణాన్ని కీర్తించడం ద్వారా కార్యకర్తల్లో గందరగోళం సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేరళకు చెందిన సీనియర్ నేత శశిథరూర్ వ్యవహారశైలిపై పార్టీలో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. ఆయన తరచుగా ప్రధాని మోడీని ప్రశంసించడం, లేదా బీజేపీ విధానాలపై మృదు వైఖరి అవలంబించడం చర్చనీయాంశమైంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వంటి మాస్ లీడర్ ఏకంగా అసెంబ్లీ వేదికగా ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడం ఆ మధ్య పెద్ద వివాదానికే దారి తీసింది. ఇది లౌకికవాద పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమనే విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ సీనియర్ నేతల ఈ ప్రవర్తన వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న నేతలు, బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను చూసి, తమ పార్టీలోని సంస్థాగత లోపాలపై అసహనంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అనే కోణం ఉంది. దిగ్విజయ్ వ్యాఖ్యల్లో ప్రశంస కంటే, కాంగ్రెస్ నాయకత్వానికి మేల్కొనండి అని చెప్పే హెచ్చరిక కూడా ఉండవచ్చు. దిగ్విజయ్ సింగ్ ఉద్దేశం ఏదైనప్పటికీ, టైమింగ్ మాత్రం పూర్తిగా బెడిసి కొట్టింది. యుద్ధం జరుగుతున్నప్పుడు శత్రువు కత్తి పదునును పొగడడం సొంత సైన్యం మనోధైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ చేసిన ఈ పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 1990వ దశకంలో గుజరాత్ మాజీ సీఎం శంకర్‌సింగ్ వాఘేలా ప్రమాణ స్వీకార వేడుకలో తీసిన ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను తాజాగా దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో యువకుడిగా ఉన్న నరేంద్ర మోడీ, సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ.. పాదాల దగ్గర కింద నేలపై కూర్చుని ఉన్నారు. ఈ ఫోటోను షేర్ చేసిన దిగ్విజయ్ సింగ్.. "ఈ ఫోటో చాలా ప్రభావవంతంగా ఉంది. ఆర్ఎస్ఎస్ స్థాయి కార్యకర్త, జనసంఘ్, బీజేపీ వర్కర్ ఎలా ఎదిగారో ఇది చూపిస్తుంది. పార్టీ అగ్రనాయకుల పాదాల దగ్గర నేలపై కూర్చున్న ఒక సామాన్య కార్యకర్త.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఎదగడం అనేది ఆ సంస్థ శక్తికి నిదర్శనం. జై సియా రామ్" అని తన పోస్ట్‌ను ముగించారు. బీజేపీని సిద్ధాంతపరంగా ఎదుర్కోవాల్సిన సమయంలో, కాంగ్రెస్ సీనియర్లే ఆ పార్టీ సంస్థాగత బలాన్ని కీర్తించడం, పరోక్షంగా బీజేపీ నరేటివ్‌కే మేలు చేస్తోంది. ఈ అంతర్గత గందరగోళాన్ని చక్కదిద్దకపోతే, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఇది మరింత పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది.

హైదరాబాద్,

మంగళవారం
30.12.2025

పాలకుల తీరుతో కృష్ణ జలాలు చంద్రార్పణం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మూలమే నీళ్లు, నిధులు, నియామకాలు. అలాంటి ప్రధాన వనరులైన నీళ్ల విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో దక్షిణ తెలంగాణ మొత్తం ఆగమై మన రైతాంగం నోట్లో మట్టి కొట్టి కృష్ణా జలాలను ఆంధ్ర పాలకులు దోచుకొని పోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం కండ్లు అప్పగించి చూడ్డం మినహా అడ్డుకునే ప్రయత్నమే చేయడం లేదు. మన అసమర్ధతకు తోడు దూర దృష్టి లేనితనమే పొరుగు రాష్ట్ర జలదోపిడీకి కారణమవుతున్నది.

డా. నలమాస శ్రీకాంత్ గౌడ్
88866 66006

నాడు ఆంధ్రప్రదేశ్ స్టేట్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ 2014 ప్రకారం, కృష్ణా నదీ జలాల పంపకం విషయంలో మొత్తంగా 811 టీఎంసీలుగా చేసి వాటి పంపకాలను ముట్టుకోకుండా మిగిలిన జలాలను పంచుకోవాలని నాటి యూపీఏ ప్రభుత్వం నాడే తెలంగాణ ప్రయోజనాలకు మరణ శాసనం రాసింది. 2014 లో రాష్ట్రం ఏర్పడ్డాక, స్వ రాష్ట్రంలో నాడు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని, ఉత్తర తెలంగాణలో ఉన్న గోదావరి బేసిన్ నీటి వినియోగం కోసం, దృష్టి సారించింది. కృష్ణా బేసిన్ నీటి వినియోగం మీద దృష్టి పెట్టకపోవటంతో ఈ కృష్ణా బేసిన్ ఆధారం చేసుకొని బ్రతుకుతున్న ఈ ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందికి గురవుతూ వచ్చారు. 198 టీఎంసీలకు హైడ్రాలిక్ క్లియరెన్స్ ఉండి, నీటి కేటాయింపులు అయ్యి ఎలాంటి వివాదం లేని గోదావరి బేసిన్ పైన పెట్టె దృష్టిలో కొంత భాగమైనా కృష్ణా పరీవాహక ప్రాజెక్టులపైన దృష్టి పెడితే ఈ పరిస్థితి దాపురించేది కాదు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మరో తప్పు 2015 లో నాలుగు రాష్ట్రాలకు కలిపి ట్రిబ్యునల్ వేసి కృష్ణా జలాలను పంచాలని గోంతెమ్మ కోరిక కోరటం. ఈ కారణంగా కూడా కృష్ణా జలాల వాటా తేల్చటంలో పీటముడి పడ్డట్టు అయ్యింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నాలుగు రాష్ట్రాలకు కలిపి తిరిగి కృష్ణా జలాల పంపిణి కోరటాన్ని మూర్ఖపు చర్యగా కొట్టి పడేసింది. అప్పటి వివాదం కేవలం రెండు రాష్ట్రాల మధ్యలో కావున ఇరు రాష్ట్రాలు తేల్చుకోవాలని, 811 టీఎంసీలు పూర్వం చేసిన పంపకాల జోలికి వెళ్ల కుండా మిగులు జాలల్లో వాటాను తేల్చుకోవాలని ఇరు రాష్ట్రాలను కోరటం జరిగింది. వాటిని పట్టించుకోకుండా 2015 లో సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేసు వేయటంతో సుమారు 7 సంవత్సరాలనుండి తీర్పు ట్రిబ్యునల్ ముందుకు రాకుండా చేశారు. ఆపెక్స్ కౌన్సిల్ మినిట్స్ లో కూడా స్పష్టంగా రికార్డయి ఉన్నది. ఏ రాష్ట్రమైనా నదీజలాల వాటా సాధించు కోవాలంటే ఒకటి ట్రిబ్యునల్ ద్వారా, మరొకటి ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్స్ ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. ఓవైపు నాలుగు రాష్ట్రాల వాటా తెల్చాలని కేసు వేసి, మరో వైపు మార్గం లేక ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ ఆంధ్రప్రదేశ్ తో చేసుకొని 299 టీఎంసీలకు ఒప్పందం కుదుర్చుకొని అగ్రిమెంట్ పైన సంతకం చేసింది నాటి బీఆర్ఎస్ సర్కార్. నాటి కేఆర్ఎంబీ మీటింగులో లీగల్ బైండోవర్ అయ్యింది వాస్తవం. ఒక్క సంవత్సరానికే ఒప్పందం చేసుకున్నామని, ఏడాదిలోగా ట్రిబ్యునల్ ఏర్పాటవుతుందని నాడు జ్యోతిష్యం చెప్పి దాన్ని పొడగించుకుంటూ పోవటం నాడు బీఆర్ఎస్ చేసిన తప్పుగా చెప్పక తప్పదు. కట్టిన ప్రాజెక్ట్స్‌కి నీటి వాటా సాధించుకోకపోతే లక్షల కోట్ల ప్రజాధనం వృధా గా తాగులబెట్టినట్టే, ఈ అనుమతి లేని ప్రాజెక్ట్స్ పైన, ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ చేసుకున్నప్పుడే 299 టీఎంసీలతో పాటు మిగిలిన 97 టీఎంసీలను కూడా అడగాల్సిన అవసరం ఉండే. అది చేయకుండా నాడు కేఆర్ఎంబీ దగ్గర కూర్చొని సంతకాలు పెట్టారు. ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ అనేది కొన్ని ట్రిబ్యునల్ల కంటే న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులకంటే కూడా చాలా ప్రభావంతమైనది. ఆనాడే బీఆర్ఎస్ పెద్ద పొరపాటు చేసింది అన్నది వాస్తవం. రాజకీయాలు ఎలా ఉన్న అంతిమ లక్ష్యం తెలంగాణాకు ప్రయోజనం చేకూర్చాటమే అని చెప్పే బీఆర్ఎస్‌పార్టీ, కేసీఆర్ ఇంటెన్షన్ గా కాకున్నా స్ట్రాటజీ వైజ్ గా అయినా ఇక్కడ ఫెయిల్ అయ్యారానే చెప్పాలి. పాలమూరు, రంగారెడ్డి కింద నాడు సద్మిట్ చేసిన డీపీఆర్‌రిజక్ట్ చేయలేదు, 2023 ఏప్రిల్ 13 నా డీపీఆర్‌ను తిరిగి వెనక్కి డీబ్ల్యూసీ పంపించింది. నాటికీ ఉన్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమే, ఎందుకు వెనక్కి పంపింది అని లోతుల్లోకి వెళితే అండర్ యూటిలైజేషన్ కింద ట్యాంక్ వైజ్ డిటైల్స్ డీబ్ల్యూసీ అడిగింది, ఎంత స్టోరేజ్ ట్యాంక్ వైజ్ అవుతున్నది, ఎన్నిట్యాంక్ లు ఉన్నది, యూటిలైజేషన్ ఎంత, వర్షదారం ఎంత, గ్రౌండ్ వాటర్ ఎంత, వినియోగించుకున్నాక మిగులు నీటి నిల్వలు ఎంత ఇలాంటి వివరాలను డీబ్ల్యూసీ అడిగితే నేటికీ నాటి ప్రభుత్వం, నేటి ఈ అసమర్ధ, అధ్యయనం లేని ఈ ప్రభుత్వం కూడా పంపించలేదు దానితో డీపీఆన్‌ను తిరిగి డీబ్ల్యూసీ పంపించి వేసింది. 45 టీఎంసీలు పోలవరం టు కృష్ణడెల్టా అబౌవ్ నాగార్జున సాగర్ అన్నారు. అప్పటికీ రాష్ట్రం ఏర్పాటు కూడా కాలేదు, అందుకే నాటి నుండి కూడా ఆంధ్ర బాబులు మన నీటిని దోచుక పోతూనే ఉన్నారు. ఆపెక్స్ కౌన్సిల్లో షాకావత్ కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి లేటెస్ట్ అలకేషన్స్ ఏర్పాటు చేయిస్తాం.. మీరు కేస్ వాపస్ తీసుకోండి అని కేసీఆర్ ను రిక్వెస్ట్ చేశారు. ఆపెక్స్ కౌన్సిల్ మీటింగ్ అయ్యింది 06 అక్టోబర్ 2020 న, కేసు ఉపసంహరించుకున్నది 2021. అక్టోబర్లో వాపస్ తీసుకున్నారు. నాడు బీఆర్ఎస్ వేసిన కేస్ తో 7 యేండ్లు, 2014 స్టేట్ రి ఆర్గనైజేషన్ యాక్ట్ లో రాసిన నిబంధనలతో కలసి కృష్ణనది నీళ్లు ఆంధ్ర బాబులు దోచుకవెళుతూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్కార్ బనాకచర్ల పైన డీపీఆర్‌సద్మిట్ కూడా చేయలేదు. ఫ్లడ్ వాటర్ మీద ప్రాజెక్ట్స్ నిర్మాణం మన దేశం లో అలాంటి చట్టం కూడా లేదు ఎందుకు డీబ్ల్యూసీతో సహా కేంద్రానికి కూడా పరిమిషన్ ఇచ్చే అర్హత లేదు, అయినా విరుద్ధంగా నల్లమల్ల సాగర్ పేరుతో నిర్మాణానికి అక్రమంగా ఒడిగడుతుంటే తెలంగాణ వాటా కృష్ణ నీళ్లను దోచుకపోతుంటే అడ్డుకునే బాధ్యత ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం పైననే ఉంటుంది కృష్ణ జల్లాల్లో 811 టీఎంసీలలో ఈ 12 యేండ్లలో వాడుకున్నది కేవలం 75 టీఎంసీలనుండి 235 టీఎంసీల వరకే ఉపయోగించుకున్నాం. 299 టీఎంసీలు వాడుకోగలిగే ఆయకట్టు ఉన్న చేసుకోలేకా పోతున్నాం. పూర్తిగా ఇది మన అసమర్థత కాదా? టెలి మెట్రిక్ ద్వారా కొలచి అడ్డుకునే బాధ్యత కేఆర్ఎంబీకి అప్పగించాలి. శ్రీశైలం రైట్ కాలువ ద్వారా పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీనివా, వెలిగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్ అక్రమ నీటి దోపిడీ నీ రాజ్యాంగ బద్ద సంస్థలు అడ్డుకోక ఇంకెవ్వరు అడ్డుకునేది కొంత స్థిమిత మనస్సు తో మేదోమధనం చేసుకుంటే అర్థం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వున్నా అన్ని ప్రాజెక్ట్స్ ను గమనించినట్లయితే, ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కాంక్రిట్ లెవల్ వరకు పూర్తి అయ్యింది లేదు, అటు గోదావరి బేసిన్ లో 968 టీఎంసీలు, ఒక్క ఎస్ఆర్ఎస్పీ పక్కకు పెడితే, ఎల్లంపల్లి 60 టీఎంసీ నీటి అలకేషన్ లేక పోయినా ప్రాజెక్ట్ నిర్మాణం చేసారు, ఇప్పుడు ఎల్లంపల్లి కాళేశ్వరం లో అంతర్ భాగం అయ్యింది. సమ్మక్క సారక్క కు నీటి అలకేషన్ ఉన్న ప్రాజెక్టు పూర్తి కాలేదు, కాలువలు, కామాండ్ ఏరియా దేన్నీ పూర్తి చేయలేదు, ఇచ్చంపల్లి, కాంతన్ పల్లి ప్రాజెక్ట్స్ కట్టేది ఉండే వాటి ఫ్లేస్ లో సీత రామ, సమ్మక్క సారక్క గా మార్చి చేతులు దులుపుకున్నారు. సుందిళ్ళ, అన్నారం, మెడిగడ్డ, కొండా పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, గోదావరి బేసిన్ 968 టీఎంసీ లకు అనుమతులు కలిగి ఉన్నాయి. కాళేశ్వరం 230 టీఎంసీ లు, సితా రామ 68 టీఎంసీ లు, సమ్మక్క సారక్క 44 టీఎంసీ లు మొత్తం 450 టీఎంసీ లు హైడ్రాలిక్ అనుమతులు కలిగి ఉన్న కాంక్రిట్ లెవల్ కి గోదావరి బేసేన్ లో కూడా ప్రాజెక్ట్స్ పూర్తి కాలేదు అన్నది నగ్నసత్యం. ఒక పెద్ద కాలువ ద్వారా ట్యాంక్ లను నింపినట్టు నింపి బాహ్యప్రపంచం కి చూపెట్టే ప్రయత్నం తప్ప ఇన్ డెప్త్ కి వెలితే ఏది పూర్తి కాలేదు. ఇంటెన్షనల్ కాకున్నా స్ట్రాటజికల్ గా నాటి పాలకుల నిర్ణయాలు దక్షిణ తెలంగాణ కు శాపంగా మారింది వాస్తవం అందుకే కల్వకుంట్ల కవిత జనం బాట ద్వారా ప్రతి జిల్లాలో వున్నా నీటి ప్రాజెక్ట్స్ ను సందర్శిస్తున్నారు. వాటి కేటాయిపులను అధ్యయనం చేస్తున్నారు, ఇటు కృష్ణ బేసిన్ ప్రాజెక్ట్స్ ను అటు గోదావరి బేసిన్ ప్రాజెక్ట్స్ ను సందర్శిస్తూ నీటి అలకేషన్స్ తెలుసుకుంటూ నిర్వసితా కుటుంబాలను కలుస్తు కలియ తిరుగుతూ ఇరిగేషన్ పైన సంపూర్ణ మైన అవగాహనకు వస్తున్నారు. కల్వకుంట్ల కవిత నీటి వాటలో జరుగుతున్న దోపిడి నీ, ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవినీతి కుండా బద్దలు కొడుతూ ప్రశ్నిస్తున్నారు. కృష్ణ నీళ్ల దోపిడీ పైన అనుసరించాల్సిన వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఫ్రెష్ అలకేషన్ సాధించే అంత వరకు జాగృతి పనిచేస్తది. ఇకనైనా ప్రభుత్వం నిద్ర వీడి అసెంబ్లీ సమావేశంలో సరి అయినా నిర్ణయం తీసుకోని తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

(వ్యాసకర్త తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి)

సమాచార హక్కు వికాస సమితి..
చట్టం కాదు, ఒక ప్రజా విప్లవం

జనగాం ప్రసాద్ రావు
76720 82695

ఆర్టీఐ 2005 రాకముందు భారతదేశంలో ప్రభుత్వ ఫైల్ ఒక పవిత్ర వస్తువు, అధికారులు దేవుళ్ల లాంటివారు, ప్రజలు యాచకుల్లా ఉండేవారు, సాధారణ వ్యక్తి ఒక పంచాయితీ ఖాతా అడిగితే, "మీకు దీనితో ఏ సంబంధం?" అనే ప్రశ్న ఎదురయ్యేది. ఈ పరిస్థితి మార్చేందుకు సమాచార హక్కు వికాస సమితి అనే ప్రజా ఉద్యమం పుట్టింది. వికాస సమితి అంటే ఎన్జీఓ కాదు, అది ఒక తిరుగుబాటు. ఇది కేవలం ఒక సంస్థ కాదు, ఇది బ్యూరోక్రసీ మీద ప్రజల తిరుగుబాటు. దీనిలో ఉన్నవారు రైతులు, కూలీలు, గ్రామ పెద్దలు, పత్రికా విలేఖరులు, సామాజిక కార్యకర్తలు, ఇవ్వన్ని కలిసిన ఒక ప్రజల సేన. వీరి లక్ష్యం ఒక్కటే "ప్రభుత్వం ప్రజలదే అయితే, సమాచారమూ ప్రజలదే కావాలి"

ఆర్టీఐ అసలు పుట్టింది కోర్టుల్లో కాదు.. గ్రామాల్లో చాలామంది అనుకుంటారు: ఆర్టీఐ=ఢిల్లీ=పార్లమెంట్, కానీ నిజం.. ఆర్టీఐ=గ్రామం=పేద ప్రజల పోరాటం. రాజస్థాన్లోని గ్రామాల్లో మస్టర్ రోల్స్, కూలీల జీతాలు, అభివృద్ధి నిధులు, వీటిని చూపించమంటే అధికారులు నిరాకరించేవారు. వికాస సమితి మొదట చేసిన పని.. ప్రజల ముందే రికార్డులు చదివించడం (సోషల్ ఆడిట్), అక్కడే బయటపడ్డాయి కూలీల పేర్లలో నకిలీ జీతాలు, చనిపోయిన వాళ్లకు చెల్లింపులు, నాయకుల జేబుల్లోకి వెళ్లిన నిధులు, నిజాలు ప్రభుత్వం తట్టుకోలేకపోయింది. ప్రభుత్వం భయపడిన అసలు కారణం ఆర్టీఐ చట్టం వచ్చింది ఎందుకంటే ప్రభుత్వం మంచిదిగా మారింది కాదు. ప్రభుత్వం భయపడింది. భయపడింది ఎందుకు? ఎందుకంటే.. గ్రామాల్లో రికార్డులు ప్రజల చేతుల్లోకి వచ్చాయి, అవినీతి బహిర్గతం అయ్యింది, అధికారులు ప్రజల ముందు తలవంచాల్సి వచ్చింది, వికాస సమితి చూపించింది సమాచారం అంటే శక్తి.

ఆర్టీఐ ఎందుకు అంత ప్రమాదకరం?

ఆర్టీఐ ఒక చట్టం కాదు. ఇది ఒక ఆయుధం. ఈ ఆయుధం ద్వారా.. కలెక్టర్‌ను ప్రశ్నించవచ్చు, మంత్రి నిర్ణయాన్ని నిలిపివేయవచ్చు, కోట్ల రూపాయల స్కాం బయటపెట్టవచ్చు. అందుకే ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారు, కొందరిని బెదిరించారు. కొందరిని కేసుల్లో ఇరికించారు. ఈ పోరాటం చాలా రక్తంతో రాసిన చట్టం.

అసలు విషాదం ప్రజలే ఆర్టీఐని వదిలేశారు

ఆర్టీఐ 2005 వచ్చాక

ప్రజలు న్యాయం గెలిచారు. కానీ నేడు.. ఫీజులు పెరిగాయి, సమాచారాన్ని ఆలస్యం చేస్తారు. ప్రశ్నించే వారిని వేధిస్తారు. ప్రజలు మళ్లీ భయపడుతున్నారు. ఇది వికాస సమితి కల కన్నా పెద్ద విషాదం. వికాస సమితి కల ఏంటి? వాళ్ల లక్ష్యం "ప్రతి పేదవాడి చేతిలో ప్రభుత్వం ఉండాలి" ఆర్టీఐ అంటే డబ్బు కాదు, పేపర్ కాదు, ఇది ప్రజల అధికారం. నిజమైన నా ప్రశ్న.. ఆర్టీఐ చట్టం మనకు ఉంది. కానీ, మనలో ఆర్.టీఐ ఆత్మ ఉందా? ప్రశ్నించగలగడం, భయపడకుండా అడగగలగడం, నిజం కోరగలగడం. ఇదే వికాస సమితి అసలు లక్ష్యం.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

నిశ్శబ్ద మృత్యువుకు ఆకాశంలో రెక్కలొచ్చాయి!?

ఫిరోజ్ ఖాన్
96404 66464

ప్రపంచమంతా సరికొత్త ఆశలతో '2026' నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న వేళ.. భాగ్యనగర ఆకాశంపై మృత్యు నీడలు కమ్ముకుంటున్నాయి. క్యాలెండర్ మారిన ప్రతిసారీ కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవడం సహజమే, కానీ ఈ ఏడాది మనందరి ముందున్న అతి పెద్ద సవాలు 'ప్రాణ రక్షణ'. త్వరలో రాబోయే సంక్రాంతి సంబరాలు ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలి కానీ, అదృశ్య మృత్యుపాశంలా మారిన 'సింథటిక్ మాంజా'తో ఎవరి కళ్లలోనూ కన్నీరు మిగల్చకూడదు. పంతాలకోసం, పతంగ్ పేచీల కోసం వాడుతున్న విషపు దారం కేవలం గాలిపటాలనే కాదు, పచ్చని సంసారాలను గాలిలో కలిపేస్తోంది. వినోదం కోసం ఒక నిండు ప్రాణాన్ని బలివ్వడం ఏమాత్రం నాగరికత కాదని మనం గుర్తించాలి. పదును ఉండాల్సింది మన ఆలోచనల్లోనే కానీ, మనిషి గొంతు కోసే దారాల్లో కాదు.

గత చేదు జ్ఞాపకాలు - గొంతు కోస్తున్న వాస్తవాలు

నేడు ఆకాశంలో ఎగురుతున్నవి రంగుల కాగితాలు కావు, రసాయనాలు పూసిన ప్రాణాంతక కత్తులని మనం గుర్తించాలి. ఒకప్పటి నూలు దారం స్థానంలో వచ్చిన 'సింథటిక్ మాంజా' ఇనుప తీగ కంటే బలంగా మారి బాటసారుల పాలిట యమపాశంలా మారుతోంది. 2016 ఆగస్టు 15న ఢిల్లీలో ముగ్గురు, 2023 జనవరిలో గుజరాత్‌లో ఆరుగురు దారానికి బలికావడం అత్యంత ఘోరం. మన నగరంలోనూ 2024 జనవరిలో హైదరాబాద్ ఫ్లైఓవర్‌లపై పలువురు వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. మూగజీవుల పాలిట ఉరితాడులా మారుతున్న ఈ దారాలు, విద్యుత్ లైన్లకు తగిలి షార్ట్ సర్క్యూట్‌లకు కారణమవుతూ పర్యావరణానికి తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. మనిషి ప్రాణం కంటే గాలిపటం గెలుపు ఏమాత్రం పెద్దది కాదు.

నిషేధాజ్ఞలు ఉన్నా.. ఆగని మృత్యు వ్యాపారం

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (2017) మరియు తెలంగాణ ప్రభుత్వం (2016) నైలాన్ మాంజా తయారీ, విక్రయాన్ని పూర్తిగా నిషేధించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. అధికారులు కేవలం పండుగకు రెండు రోజుల ముందు తనిఖీలు చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. తయారీ కేంద్రాల నుండి పంపిణీ గొలుసు వరకు నిఘా ఉంచినప్పుడే ఈ మృత్యు వ్యాపారాన్ని అరికట్టగలం. నైలాన్ దారానికి బదులుగా సురక్షితమైన 'నూలు దారం' వాడటం వల్ల పండుగ ఆనందం ఏమాత్రం తగ్గదు. మీ చిన్న సరదా ఒకరి ఇంటిలో దీపం ఆర్పేయవచ్చని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

సురక్షితమైన సంక్రాంతి వైపు అడుగులు

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ ప్రమాదాల గురించి వివరించాలి. 'ప్రాణం లేని గాలిపటం కోసం.. ప్రాణం ఉన్న జీవులను బలివ్వద్దు' అనే సందేశం సోషల్ మీడియా వేదికగా యువతకు చేరాలి. విక్రయదారులు కూడా సామాజిక బాధ్యతతో ఇలాంటి ప్రమాదకర వస్తువులను అమ్మడం మానుకోవాలి. ఆకాశంలో ఎగిరే గాలిపటం స్వేచ్ఛకు చిహ్నం కావాలే తప్ప, మృత్యువుకు చిరునామా కాకూడదు. మృత్యువుతో పేచీని విడిచి, మానవత్వంతో పండుగను ఆహ్వానిద్దాం.

అమ్మో! గాలిపటం ఎగురవేస్తే జైలుకు వెళ్తామా?

సింథటిక్ మాంజా వాడకం అనేది చట్టరీత్యా అత్యంత తీవ్రమైన నేరం. పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 ప్రకారం ఇలాంటి దారాలను విక్రయించినా లేదా వాడినా ఐదేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. అంతేకాకుండా, జూలై 1, 2024 నుండి అమల్లోకి వచ్చిన కొత్త చట్టం 'భారతీయ న్యాయ సంహిత' లోని సెక్షన్ 103(1) ప్రకారం, దారం వల్ల ఎవరైనా ప్రాణాలు కోల్పోతే దానిని 'హత్య కేసు' గా నమోదు చేసే అవకాశం ఉంది. తీవ్రమైన నిర్లక్ష్యం రుజువైతే సెక్షన్ 106 కింద కఠిన శిక్షలు తప్పవు. పతంగ్ పేచీలో మీరు వాడే ఒక చిన్న దారం మిమ్మల్ని హంతకుడిగా మార్చి జైలు పాలు చేయగలదని గుర్తుంచుకోండి.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- **జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29: సంగారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు గాను రూ.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన నాలుగు పారిశుధ్య వాహనాలను (ట్రాక్టర్లు) మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి పని మరింత సులభంగా, వేగంగా సాగేందుకు ఆధునిక హనాలనుఅందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ వాహనాల ద్వారా చెత్త సేకరణ, తరలింపు పనులు మరింత సమర్థవంతంగా జరుగుతాయన్నారు. అదేవిధంగా, సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న

400 పైచిలుకు మునిసిపల్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ, ఆ బీమా పాలసీలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీలను టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి సంబంధిత సిబ్బందికి పంపిణీ చేశారు.పారిశుధ్య సిబ్బంది తమ విధులను నిర్వర్తించే సమయంలో ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదవశాత్తు తాత్కాలిక వైకల్యం, శాశ్వత వైకల్యం కలిగిన లేదా మరణించిన సందర్భాల్లో ఈ ప్రమాద బీమా పాలసీ ద్వారా బాధితుడు లేదా వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. ఈ ప్రమాద బీమా సౌకర్యం ద్వారా సిబ్బందికి భద్రతా భావం పెరుగుతుందని, వారి కుటుంబాలకు కూడా భరోసా కలుగుతుందని నిర్మలా జయప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం, భద్రత పట్ల ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలీ సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 29 : అలీ సాగర్ ఎత్తిపోతల నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లోని 48 వేలకు పైగా ఎకరాల్లో అలీ సాగర్ ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. యాసంగి సీజన్ ప్రారంభమైనా నీటిని విడుదల చేయకపోవడం తో మూడు నియోజకవర్గాల రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. యాసంగి సీజన్ తైబందీ ఖరారు కాలేదనే కారణంతో ఇరిగేషన్ ఇంజనీర్లు నీటిని విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. రైతులు వరి నార్లు పోసుకొని నెల రోజులవుతోందని, తక్షణమే నీటిని విడుదల చేయకుంటే నార్లు ముదిరిపోయి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లున్నా ఎత్తిపోతలు ప్రారంభించక పోవడం సరికాదన్నారు. ఒక్క నవీపేట మండలంలోనే 14 వేల ఎకరాల్లో అలీ సాగర్ కింద యాసంగి పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. యాసంగి వరి నాట్లు వేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు వలస వచ్చారని, నీటి విడుదల లో జాప్యం కారణంగా రైతులతో పాటు వలస కూలీలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అలీ సాగర్ ఎత్తిపోతలు ప్రారంభించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కన్నుల పండవగా శ్రీ కోటి శ్రీ సూక్తా పారాయణం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29: భవానీ భువనేశ్వరి దేవాలయంలో శ్రీకోటి శ్రీ సూక్తా పారాయణ కార్యక్రమాన్ని ఆదివారం కన్నుల పండుగ నిర్వహించారు. బసవ కళ్యాణ్ పీఠాధిపతి, శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి, రంగంపేట పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ మధుసూదానంద సరస్వతి స్వామి వార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమం వైభవంగా జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వెయ్యి మందికి పైగా మహిళలు సామూహిక లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తో పాజి అనంత కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి త్వరలో వైద్య సేవలు

ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 29: మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేసి అనుకున్న సమయంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్సాగర్ రావు స్పష్టం చేశారు. సోమవారం భవన నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రీత్యా తనకు కొంత ఇబ్బందిగా మారి నిర్మాణ పనుల లో జాభ్యత జరిగిందని తెలిపారు. తాను ఎన్నికలలో ఇచ్చిన హామీలను తూషా తప్పకుండా నెరవేస్తానని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలే కాకుండా అనేక నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. గోదావరి ఉప్పంగి లోతట్టు ప్రాంతాలలో వర్షాకాలంలో మీరు చేరుతున్నందున కరకట్ట నిర్మాణం వేగ వంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే లక్షపేట దండేపల్లి మండలాలలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తి చేయునట్లు స్పష్టం చేశారు. మంచిర్యాలలో నిర్మించిన స్మశాన వాటిక దేశంలోనే ఒక గుర్తింపు తెచ్చింది అన్నారు. అలాగే పట్టణంలోని నిర్మిస్తున్న మాతా శిశు మరియు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలో గుర్తింపు పొందే విధంగా అన్ని రోగాలకు తగిన వైద్య సేవలను మంచిర్యాలలోనే అందించనున్నట్లు తెలిపారు. నాణ్యతమైన వైద్యమును అందించి ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఆరోగ్య రీత్యా కోల్పోవడానికి ప్రార్ధనలు చేసిన అభిమానులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్న అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తోముల నరేష్, మాజీ కౌన్సిలర్ నాయకులు పూదరి తిరుపతి, పూదరి ప్రభాకర్, గడ్డం సతీష్ యాదవ్, ఖదీర్ మహిళా నాయకురాలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చైనా మాంజా నిషేధం

- **కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర**

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 29: కామారెడ్డి జిల్లా పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (సింథటిక్ / నైలాన్ దారం) విక్రయాలు, వినియోగంపై పూర్తిస్థాయిలో నిషేధం అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజా ఎక్కువగా విక్రయించే దుకాణాలు, గోడౌన్లు, మార్కెట్లపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే ఈ చైనా మాంజా పర్యావరణానికి తీవ్రమైన విపత్తుగా మారడంతో పాటు, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నదని తెలిపారు. చైనా మాంజా విక్రయం, కొనుగోలు చేయడం పర్యావరణ పరిరక్షణ చట్టం - 1986 ప్రకారం నేరమని, నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజాను విక్రయించినా లేదా వినియోగించినా ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.10,000/ వరకు జరిమానా విధించే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. నిషేధిత మాంజాను విక్రయించే దుకాణాలపై కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత వ్యాపార లైసెన్సులను కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- **రికార్డులను పరిశీలించిన సీపీ**

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 29: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పలు కీలక కార్యాలయాలను విభాగాలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల నిర్వహణ, రికార్డుల నమోదు భద్రతా విభాగాల పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో ఫైళ్ల నిర్వహణ, సిబ్బంది హాజరు సర్వీస్ రికార్డులను పరిశీలించారు. పోలీస్ వాహనాల స్థితిగతులు, లాగ్ బుక్స్ మరియు వాహనాల మెయింటెనెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆయుధాల నిల్వ, వాటి భద్రత మరియు రిజిస్టర్లను తనిఖీ చేశారు. హోం గార్డ్స్ కేటాయింపులు, వారి విధులకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ప్రత్యేక దళాల సంసిద్ధతను, డాగ్ స్క్వాడ్ నిర్వహణ మరియు వాటి శిక్షణ గురించి అధికారులకు సూచనలు చేశారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించే పరికరాల పనితీరును మరియు భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.తనిఖీ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి విభాగంలో రికార్డులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వ ఆస్తులను (వాహనాలు, ఆయుధాలు) బాధ్యతాయుతంగా కాపాడుకోవాలని సూచించారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సేవలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ , భీంరావు

కమిషనరేట్ ఏవో మునిరామయ్య , ఆర్.ఐలు రజినీకాంత్ , కిరణ్ కుమార్ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

లైంగికదాడి నేరస్థుడిపై 'పిడి యాక్ట్
కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు

మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతూ, సమాజంలో భయభ్రాంతులు సృష్టిస్తున్న కరుడుగట్టిన నేరస్థుడు సంపంగి ప్రేమ్ కుమార్ పై కరీంనగర్ పోలీస్ కమిషనర్ పి.డి. చట్టం ప్రయోగించారు. ఈ మేరకు సోమవారం (డిసెంబర్ 29) ఉత్తర్వులు జారీ చేసి, నిందితుడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. ప్రేమ్ కుమార్ 2019 నుండి వరుస నేరాలకు పాల్పడుతున్నాడు. రాజన్న సిరిసిల్ల (బోయినపల్లి), కరీంనగర్ (రామడుగు, గంగాధర) జిల్లాల పరిధిలో దొంగతనాలు, భౌతిక దాడులు మరియు మైనర్ బాలికలపై లైంగిక వేధింపుల కేసులు ఇతనిపై ఉన్నాయి. గతంలో ఒక మైనర్ బాలిక కిడ్నాప్ మరియు లైంగిక దాడి కేసులో ఇతనికి 10 సంవత్సరాల జైలు శిక్ష కూడా పడింది. 2023లో ఒకసారి పి.డి. చట్టం ప్రయోగించినప్పటికీ, హైకోర్టు బెయిల్ పై విడుదలయ్యాడు.జైలు నుండి విడుదలైనప్పటికీ నిందితుడు తన ప్రవృత్తిని మార్చుకోలేదు. జూలై 2025లో అలుగునూరు సమీపంలోని SRSP కాలువ వద్ద ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఎదురుతిరగడంతో రాయి మరియు గాజు సీసాతో తలపై బాది చంపడానికి ప్రయత్నించాడు. ఈ కేసులో జూలై 20న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- **కలెక్టర్ పమేలా సత్పతి**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 29: జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి నేడొక ప్రకటన లో తెలిపారు.జిల్లాలో ఈ రోజు వరకు 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాకి 22,368 మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా, త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉదయం 6.00 గంటల నుండి కౌంటర్ వద్ద యూరియా సేల్స్ ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు మొక్కజొన్న సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని రైతులకు భరోసానిచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కలెక్టర్ అట్టి ప్రకటన లో కోరారు.

జవహర్ నగర్ పోస్టాఫీసు కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులో విలీనం

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 29: కరీంనగర్ జ్యోతినగర్ ప్రాంతంలో ఉన్న జవహర్ నగర్ పోస్టాఫీసును కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులో విలీనం చేయడం జరిగిందని, జనవరి 1వ తేది నుంచి జవహర్ నగర్ పోస్టాఫీసులో ఏలాంటి తపాలా సేవలు అందుబాటులో ఉండవని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నగర్ బ్రాంచి పోస్టాఫీసులో ఇప్పటివరకు సేవలు పొందిన కస్టమర్లు జనవరి 1నుంచి తమ తపాలా సేవలను సమీపంలోని ముకరంపుర పోస్టాఫీసు లేదా కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులో పొందాలని సూచించారు. శాఖా పరమైన పాలసీ విధానంలో భాగంగా ఈ బ్రాంచి విలీనం జరిగిందని, ఈ విలీనానికి ప్రజలు, ఖాతాదారులు సహకరించాలని పోస్టల్ ఎస్పీ శివాజీ ఆ ప్రకటనలో కోరారు.

కామారెడ్డిలో మౌళిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

- **ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 29: కామారెడ్డి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను అయన ప్రారంభించారు. అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. విద్యానగర్ పరిధిలోని వార్డ్ నెంబర్ 33, 34లలో జన్మభూమి రోడ్డుకు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా 46వ వార్డు చోటా కసాబ్ గల్లీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కూడాశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల సమస్యలు తొలగి, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ ప్రాంతం ఎన్నాళ్లుగానో మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని అన్నారు. "కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో ఎక్కడా వెనక్కు తగ్గేది లేదు. పట్టణం అయినా, గ్రామం అయినా సమానంగా అభివృద్ధి జరగాలన్నదే మా లక్ష్యం. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి మార్గదర్శకం" అని అన్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని ప్రాంతాలను గుర్తించి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. కామారెడ్డి పట్టణాన్ని సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యారంగ సమస్య లను పరిష్కరించాలి

- **ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్య లను పరిష్కరించాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఇవాళ శాసన మండలి శీతకాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రములో అన్ని యూనివర్సిటీలకు ప్రతి ఏడాది ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. ఆయా యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ను భర్తీ చేయాలన్నారు. అలాగే సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు రెవెన్యూ డివిజన్ గా మంజూరు కాగా, ఏండ్ల నుంచి ఆర్డీవో, సబ్ రిజిస్ట్రేషన్, కోర్టు ఏర్పాటు చేయలేదన్నారు. ఇక్కడ ఎంబీ ఐ ఆఫీసులు ఏర్పాటు చేయాలని కోరారు. బహుళ అంతస్థ

భవనాల నిర్మాణలా దృష్ట్యా ప్రమాద నివారణకు చర్యలు తీసుకునేలా తగు మార్గదర్శకాలు ప్రభుత్వం రూపొందించాలన్నారు.

సిగాచి మృతుల కుటుంబాలకు కోటి నష్టపరిహారం ఇవ్వాలి

- **సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29 : సిగాచి పరిశ్రమలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారము చెల్లించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శివాజీ పరిశ్రమలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ సిగాచి పరిశ్రమలో ఇప్పటివరకు 25 లక్షల నష్టపరిహారం మాత్రమే అందిందని అన్నారు. సిగాచి పరిశ్రమలో ప్రమాదం సంభవించి ఆరు నెలలు పూర్తవుతున్న ఇప్పటివరకు మిగతా 75 లక్షల నష్టపరిహారము ఎందుకు చెల్లించడం లేదని పరిశ్రమ యాజమాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యాన్ని సీఈఓ అమిత్ రాజును అరెస్టు చేసి రిమాండ్కు పంపించడం జరిగిందని అన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల మాట గాలి మాటగా మారిందని అన్నారు. గత ఆరు నెలలుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రతి ఒక్కరికి ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయం నుండి డెత్ సర్టిఫికెట్లు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పూర్తిగా నష్టపరిహారం చెల్లించేంతవరకు కార్మికుల పక్షాన ఉండి సిఐటి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నల్లగండ్ల రాజు, కార్మికుల కుటుంబాలు పాల్గొన్నారు

ప్రాంతీయం

ఏపీలో పెట్టుబడుల ఆకర్షణకు, సంపద సృష్టికి హైవేల నిర్మాణం చేపట్టనున్నాం. కొత్తగా మచిలీపట్నం నుంచి హైదరాబాద్ఫ్యూచర్ సిటీ వరకు, అమరావతి నుంచి బెంగళూరు వరకు ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటు చేయనున్నాం. ఇతర మెట్రో నగరాలకు దీటుగా అమరావతి చుట్టూ రూ.38 వేల కోట్లతో 190 కిలో మీటర్ల ఓఆర్ఆర్ నిర్మిస్తాం.

- ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రాంతీయం

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 29: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 132 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, ఏ ఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), డిసెంబర్ 29: పేద విద్యార్థుల అభ్యున్నతి, గ్రామ అభివృద్ధిలో తన వంతు పూర్తి సహకారం ఉంటుందని వైద్యులు డాక్టర్ పురుషోత్తం పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం తునికి ఖల్సా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న తాను ఇప్పటికే రోటరీ క్లబ్ ద్వారా వివిధ రకాల సేవలు అందించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా తాను చిన్నతనంలో పడిన కష్టాలు నేటితరం పేద విద్యార్థులు పడకూడదనే లక్ష్యంతో విద్యార్థుల అభ్యున్నతి, సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు 25 సైకిళ్లు అందజేసి దాతృత్వాన్ని చాటుకోగా, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పురుషోత్తంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండగళ్ల గణేష్ , ఉపసర్పంచ్ గంగుమల్ల లక్ష్మికొండల్ రెడ్డి , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి గౌడ్, మాజీ సర్పంచ్ జానీ, మాజీ ఉపసర్పంచ్ రామ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు గుడ్ల భరత్ గౌడ్, గుండమైన మహేష్, ముత్తా మహేష్, నాయకులు శ్రీరామ్ నర్సింలు, జెల్ల మల్లేశం, శ్రీరామ్ సంతు, చీర్ల శ్రీహరి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

- సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 29: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనల అమలును పోలీసులు మరింత కఠినతరం చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా, ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ కొత్త నిబంధనలు సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి.మైనర్ డ్రైవింగ్ , డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన కేసుల్లో ఇకపై TSETicket App ద్వారా కేవలం 'జీరో ఫైన్' టికెట్ మాత్రమే జారీ చేయనున్నారు. ఈ కేసుల్లో ఆన్‌లైన్‌లో జరిమానా చెల్లించే అవకాశం ఉండదని, ఈచలాన్‌ను నేరుగా కోర్టుకు పంపిస్తారని పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ - సెక్షన్ 201 ప్రకారం సంబంధిత వాహనాన్ని పోలీసులు తాత్కాలికంగా స్వాధీనం చేసుకుంటారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల తరహాలోనే, ఈ కేసుల్లో కూడా నిందితులపై పెట్టీ కేసు చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనం, ఈచలాన్ కాపీలతో సహా నిందితులు తప్పనిసరిగా కోర్టులో హాజరుకావాల్సి ఉంటుందని వెల్లడించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ కేసుల్లో వాహన యజమాని నిర్లక్ష్యం చేసినట్లు తేలితే, వారిని రెండవ నిందితుడిగా (A2) చేర్చి కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాపాయం నుంచి తమను తాము కాపాడుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి భవిష్యత్తును ప్రమాదంలో పడేయవద్దని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

గ్రామాభివృద్ధి కోసం ఎన్ఆర్ఎం హెల్పింగ్ హాండ్స్ ఏర్పాటు

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 29: పుట్టిన ఊరుకు సేవా చేయలనే ఉద్దేశ్యంతో స్వంత గ్రామాభివృద్ధి కోసం ఎన్ఆర్ఎం హెల్పింగ్ హాండ్స్ తో అభివృద్ధి చేస్తామని వివిధ పట్టణాలలో స్థిరపడిన మర్రిముచ్చాలకు చెందిన ఎన్ఆర్ఎం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తెలిపారు. సోమవారం కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చల గ్రామ వాసులు ఉత్తిరిత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని ఊరికి మంచి చేయాలనే సదుద్దేశంతో ఒక అసోసియేషన్ ని ఏర్పాటు చేసుకొనుటకు సమావేశంలో ఎన్ఆర్ఎం హెల్పింగ్ హాండ్స్ పేరుతో అసోసియేషన్ ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంకు అధ్యక్షతన నక్కల నరేష్ రెడ్డితో పలువురు పాల్గొని కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిపరంగా ఊరికి దూరంగా ఉంటున్న అందరం కలిసి ఊరికి తమ వంతు సహాయముతో ఊరు అభివృద్ధికి, విద్య, వైద్యం పరంగా నిరుపేద కుటుంబాలకు చేయూతనందించడానికి ఈ అసోసియేషన్ ను ఏర్పాటు చేసినట్లు నక్కల నరేష్ రెడ్డి అన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 29: జిల్లాలో ఎక్కడైనా సరే అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా హెచ్చరించారు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి , ఇంజనీరింగ్,పోలీస్,ఫారెస్ట్, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా ఇసుక కొనుగోలు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.ప్రభుత్వ నిర్మాణాల కోసం అవసరమైన ఇసుకను సాండ్ బజార్లో నిలవ చేస్తాం అన్నారు. ఇప్పటికే నర్సాపురంలో సాండ్ బజార్ ప్రారంభించడం జరిగిందని, మెదక్ లో తొందరలో ప్రారంభించుకోబోతున్నామని ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణాకు తావు లేకుండా, యంత్రాలు ఉపయోగించి సాండ్ ను రవాణా చేసిన ఎడల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైతే ఇసుక అవసరం ఉంటుందో టీజీఎండిసి ద్వారా ద్వారానే కొనుగోలు చేయాలన్నారు సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఒక ఫార్మాట్ అందించడం జరిగిందని, ఇసుక అవసరాలను అందులో పొందుపరిచి అందజేయాలన్నారు .ఇలా చేయడం ద్వారా సాండ్ బజార్లో వారికి అవసరం అవసరానికి తగ్గట్టుగా ఇసుక అందుబాటులో ఉంచుతామన్నారు. ఇల్లీగల్ మైనింగ్ ఎక్కడ జరగకూడదాని, మైనింగ్ జరుగుతున్నట్లు ఇన్ఫర్మేషన్ ఉంటే తెలపండి చట్టాలకు అనుగుణంగా తక్షణం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇల్లీగల్ సాండ్ మైనింగ్ ల ఏరియాలలో సీసీటీవీ ల కెమెరాల ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేపడుతున్నట్లు వివరించారు. వాటిని ఆధారాలుగా చేసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ఫారెస్ట్ ల్యాండ్ నుంచి ఇసుక రవాణా జరుగుతుందని సమాచారం ఉందన్నారు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తనిఖీలు నిర్వహించి అటువంటి వారికి చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సాండ్ బజార్ ఆన్లైన్ ద్వారా అందుబాటులో ఉందని తప్పనిసరిగా వసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవాలన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందని ఆ ప్రాంతాలలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్యడిఆర్ఓ భుజంగ రావు, ఆర్డిఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, డి ఆర్ డి ఓశ్రీనివాసరావు,ఈడి మైన్స్ సంజయ్ కుమార్, డీఎస్పీపీ ప్రసన్నకుమార్, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ పోలీస్, పోలీస్,అధికారులు పాల్గొన్నారు.

కొండల్ రెడ్డిని పరామర్శించిన పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 29: టీపీటీఎఫ్ రాష్ట్రం మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మ దేవేందర్ రెడ్డి సోమవారం మెదక్ పట్టణంలోని కొండల్ రెడ్డిని వారి నివాసంలో పరామర్శించారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్, శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి.రాజు, నాయకులు లింగారెడ్డి, ప్రభు రెడ్డి, మేడిశెట్టి. శంకర్, మహమ్మద్, మెహన్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 29: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విద్యావంతులై విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి ప్రవేశాలు, అలాగే ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9 తరగతుల వరకు ఖాళీల ప్రవేశాల కోసం కామన్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా టీజీ ఎస్డబ్ల్యూఈఆర్ఐఎస్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈ లలో 9వ తరగతి, టీజీ టీడబ్ల్యూఈఆర్ఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈ లలో 8వ తరగతి, టీజీ ఎస్డబ్ల్యూఈఆర్ఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్ ,మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను https://tgcet.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ జనవరి 21 కాగా, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తు కోసం కులం, ఆదాయం సర్టిఫికేట్ నంబర్లు, ఆధార్ కార్డు నంబర్, జనన ధృవీకరణ పత్రం, ఫోటోలు అవసరమని తెలిపారు. సర్టిఫికెట్లను త్వరగా పొందేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

సింగూరు ప్రాజెక్టుకు మరమ్మత్తులు..

రబీ పంటకు సాగు జలాల అందించలేం

- ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు

ప్రతిపక్షం, మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 29: సింగూరు పాజెక్టు మరమ్మత్తుల దృష్ట్యా ఘనపూర్ ఆనకట్టు (వనదుర్గ ప్రాజెక్టు) రబీ 202526 ఆయకట్టుకు సంభందించి సాగునీరు విడుదల చేయలేమని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనదుర్గ ప్రాజెక్టు పరిదిలో గల కుల్చారం, మెదక్, హవేళీ ఘనపూర్ మరియు పాపన్నపేట్ మండలాలలోని ఆయకట్టు పరిధిలో గల రైతులు సహకరించాలని కోరారు. ఈ విషయమై మరింత సమాచారం కొరకు ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ఈ యేడిది శాంతి భద్రతలు ప్రశాంతం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్
- 2025 వార్షిక క్రైం రౌండ్ అప్ విడుదల

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 29: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరమంతా శాంతిభద్రతల పరిస్థితి ప్రశాంతంగా కొనసాగిందని పోలీస్ కమిషనర్ ఎస్ ఎం విజయ్ కుమార్ తెలిపారు. నేరాల నమోదు, చట్టం,ఆర్డర్ పరిస్థితిపై వార్షిక సమీక్షను సోమవారం విడుదల చేశారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ ఫిర్యాదులను పోలీసులకు తెలియజేయాలని ప్రోత్సహించామని, ఫిర్యాదు వచ్చిన ప్రతి సందర్భంలోనూ ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. నేరాలను స్వేచ్ఛగా నమోదు చేయడం వల్ల నేరాల సరళిని అర్థం చేసుకోవడమే కాకుండా నేరస్తులను గుర్తించి అరెస్టు చేయడంలోకూడా సహకారం లభించిందన్నారు.ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు మోడల్ ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయడంతో జిల్లా అంతటా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సహా ఇతర చట్ట ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 507 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. అలాగే వివిధ ప్రజా కార్యక్రమాలు, జాతరలు, పండుగల సందర్భంగా తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. ముఖ్యంగా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో జరిగిన కల్యాణోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించామన్నారు.ట్రాఫిక్, రోడ్డు భద్రతకు ఈ ఏడాది ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో ట్రాఫిక్ అమలులో విధానపరమైన మార్పులు తీసుకొచ్చి, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్, క్వాడ్రపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. మోడిఫైడ్ సైలెన్సర్ల వల్ల ఏర్పడుతున్న ధ్వని కాలుష్యంపై కూడా ఉక్కుపాదంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాబోయే సంవత్సరంలో నేరాల ఉచిత నమోదు, ప్రజా ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, నివారణ చర్యలు, రహదారి భద్రత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ తెలిపారు. పారదర్శకమైన, అవినీతి రహిత, బాధ్యతాయుతమైన పోలీసింగ్ ద్వారా ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు.

సింగూర్ ప్రాజెక్టు నుండి నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలి

- లేదా క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలి
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి.

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 29 : సింగూర్ నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని, లేదా క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...సింగర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టకు నీటి విడుదలపై ప్రభుత్వం ఎలాంటి అధికారికంగా ప్రకటన చేయకపోవడంతో అయోమయంలో జిల్లా రైతంగం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగూర్ నుండి ఘనపూర్ ఆయకట్టకు నీటిని విడుదల చేయిస్తారా, లేదా క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే ఘనపూర్ ఆయకట్ట కింద పంటలు సాగుతాయని, ప్రభుత్వం ఇప్పటికీ సింగూర్ నీల విషయంలో అధికారికంగా ప్రకటన చేయకపోవడం రైతులను అయోమయానికి గురి చేస్తుందని ప్రభుత్వం మొండి వైఖరి తాగదని ఎదవ చేశారు. బిఆర్ఎస్ అయంలో ప్రతి పంటకు నీళ్లు ఇచ్చి పంట కూడా కొన్న ఘనత కేసీఆర్ గారిది అని అన్నారు. సింగూర్ నుండి నీళ్లను హైదరాబాద్కు తీసుకెళ్లకుండా చర్యలు ఏర్పాటు చేసి,మెదక్ జిల్లాకె సింగ్ నీళ్లు అంకితం చేసింది కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని మండిపడ్డారు. వానకాలం జరిగిన నష్టపరిహారం ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగూర్ నుండి నీటిని విడుదల చేస్తారా లేదా క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారా అనే విషయమై ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నామని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, మాజీ ఎంపీపీలు కొత్తపల్లి కిష్టయ్య,దుర్గయ్య, మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షులు సోములు,మాజీ కౌన్సిలర్లు విశ్వం, మాయ మల్లేశం చంద్రకళ,సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు కృష్ణ గౌడ్ లింగారెడ్డి, సర్పంచ్ లు సాంబశివరావు, మ్యాకల. సాయిలు,పాపన్నపేట్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు కండెల. సాయిలు, ఏనుగుల.రాజు,మెడిశెట్టి. శంకర్, బట్టి. ఉదయ్,రామచంద్ర రెడ్డి మోహన్ నాయక్ శ్రీనాథ్ రావు, సంగమేశ్వర్, బద్రి. మల్లేశం,మాజీ సర్పంచ్ లు, మెదక్ పట్టణం, మెదక్, హవెలిఘనపూర్, పాపన్నపేట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.మెదక్ : సింగూర్ నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు

"

ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాకుండా తమ పార్టీ తలుపులు మూసుకున్నాయి. వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇస్తాం. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తాము ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేని గతి పట్టింది. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఆ భయంతోనే మున్సిపల్ ఎన్నికలు పెట్టట్లేదు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నర్సింగ్ హోమ్‌లో అగ్నిప్రమాదం

16 మంది సజీవ దహనం

ఇండోనేసియాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సులవేసి ద్వీపంలోని ఓ నర్సింగ్ హోమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 16 మంది సజీవదహనమయ్యారు. మరికొంతమంది గాయపడ్డారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వెర్ధ దమై రిటైర్మెంట్ హోమ్‌లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌లోని వృద్ధులు విశ్రాంతి తీసుకుంటున్నారు. మంటల ధాటికి వారు తమతమ గదుల్లోనే సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సుమారు 10 మందిని ప్రమాదం నుంచి కాపాడారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

విశ్వ వీక్షణం

ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ

- ట్రంప్ నాయకత్వంలో శాంతి సాధ్యమన్న జెలెన్ స్కీ

ఇటీవల ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఉక్రెయిన్ రష్యా, ఇజ్రాయెల్ పాలస్తీన , ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇక భారత్ దాయాది దేశం పాక్ తరుచూ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. మూడేళ్ల నుంచి రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతూనే ఉంది.. వేల మంది ప్రాణాలు కోల్పోయారు. కోట్లలో ఆస్తులు నష్టపోయారు. ఇరు దేశాల మధ్య ఎంతగా శాంతి ఒప్పందాలు జరిగినప్పటికీ ఎవరూ తగ్గకుండా యుద్ధం కొనసాగిస్తూనే ఉన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య కీలక భేటీ జరిగింది. ఫ్లోరిడాలోని మార్‌ఎ లాగోరో నివాసంలో జెలెన్స్కీ, ట్రంప్ షేక్ హ్యాండ్ ఇచ్చుకొని గంటన్నర పాటు చర్చలు జరిపారు. ఉక్రెయిన్ రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగింది. యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించడమే లక్ష్యంగా చర్చలు కొనసాగాయి. యుద్ధాన్ని ముగించడానికి 20 పాయింట్ల శాంతి ప్రణాళికపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. రష్యా అధ్యక్షుడు పుతిన్ శాంతి చర్చలకు సుముఖత వ్యక్తం చేస్తూనే, ఉక్రెయిన్ చర్చలకు రాకపోతే సైనిక చర్యలు తీవ్రం చేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే.ఈ విషయంపై ఇరు దేశాల అధ్యక్షులు చర్చించినట్లు తెలుస్తుంది. ఈ సమావేశం చాలా బాగా నడిచిందని ట్రంప్ అభివర్ణించారు. మేము యుద్ధాన్ని ముగించడానికి ఎంతగానో కష్టపడుతున్నాం..అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. జెలెన్స్కీ అనంతరం జెలెన్స్కీ మాట్లాడుతూ.. ఈ భేటీ న'నిర్మాణాత్మకమైనది' అని పేర్కొన్నారు. ఉక్రెయిన్ కు బలం ద్వారా శాంతి ఎంతో అవసరం అని అన్నారు. ట్రంప్ నాయకత్వంలో త్వరలో శాంతి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఇద్దరు అధ్యక్షులు గతంలో కంటే ఎంతో ఉత్సాహంగా మాట్లాడినట్లు కనిపిస్తుంది. ఇకనైనా రష్యఉక్రెయిన్ మధ్య యుద్ధం ఆగుతుందా?లేదా? అన్నది ముందు ముందు తెలియాల్సి ఉంది.

ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లిన బస్సు

- నలుగురు మృతి, 10 మందికి గాయాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, డిసెంబర్ 29: ముంబై నగరంలో ఓ బస్సును రివర్స్ చేస్తుండగా అది పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు పాదచారులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి నగరంలోని భాందూప్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. 'బృహన్‌ముంబై ఎలక్ట్రిక్ సప్లయ్, ట్రాన్స్‌పోర్ట్' (బెస్ట్) కు చెందిన ఓ బస్సును డ్రైవర్ వెనక్కి తీస్తుండగా హఠాత్తుగా ఫుట్ పాత్‌పైకి దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న వెంటనే ఎమర్జెన్సీ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టిందని ఓ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. గాయపడ్డవాళ్లను అంబులెన్స్‌లో సమీపంలోని దవాఖానకు తరలించినట్టు చెప్పారు.

ఆరావళి పర్వతాల కేసులో సుప్రీం విచారణ

- గతంలో ఇచ్చిన అనుమతులపై స్టే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ జరిగింది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.



100 మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా తాత్కాలిక దరఖాస్తుదారుల ప్రవర్తనపై సీజెఐ తీవ్ర అసంతృప్తి చెందారు. ఆరావళి పర్యతాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించింది. ఈ కేసును జనవరి 21,2026న వివరణాత్మకంగా విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

స్థానిక ఎన్నికల కోసం కలిసిన పవార్ కుటుంబం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, ముంబై, డిసెంబర్ 29: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పవార్‌ల కుటుంబం జట్టు కట్టింది. పింప్రిచించ్వాడ్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఎన్సీపీ, ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు కలిసికట్టుగా పోటీ చేయబోతున్నాయి. ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించారు. పవార్ పరివార్ మళ్లీ కలుసుకుందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఖరారు చేసే సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



పిల్లలు వద్దు ఆదాయమే ముద్దు

భారత్‌లోనూ పెరిగిపోతున్న DINK కల్చర్..

మన తాతలనాటి కాలంలో పిల్లలు ఎంతమంది అంటే 8 లేదా 9 అంతకు మించి అనే సంఖ్య వినిపించేది. తర్వాత కుటుంబ నియంత్రణ, జనాభ రేటు అంటూ.. ఇద్దరు పిల్లలు ముద్దు అనే కార్యక్రమం ప్రభావం మన దేశంలో బాగానే ప్రభావంచూపింది. తర్వాత అందరూ ముగ్గురు, ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకున్నారు. మారుతున్న జీవన శైలి ఉమ్మడి కుంటుంబాలు విచ్ఛిన్నం కావడం అది రాను రాను ఒకరికి పడిపోయింది. ఇద్దరు కంటే ఒకరు ఉంటే బెస్ట్ అనుకున్నారంతా. ఇప్పుడు ఏకంగా పిల్లలే వద్దు అనుకుంటున్నారు. లైఫ్‌స్టైల్‌లో మార్పులు... లగ్జరీలకు అలవాటు పడ పిల్లల్ని కనడం.. వారి పెంపకం, చదువు లాంటి వాటిపై దృష్టి పెట్టలేక పిల్లలు వద్దు.. ఆదాయమే ముద్దు అనే స్థితికి చేరుకున్నారు. మన దేశంలో ఈ పద్ధతి ఇప్పుడు కొత్తగా వినిపిస్తున్నా.. పాశ్చాత్య దేశాలలో ఈ విధానం ఎప్పటినుంచో అమలులో ఉంది. దీనిని DINK అంటున్నారు. ఇంతకీ ఈ DINK అంటే ఏమిటి?

ఆలోచన మారిపోయింది..

ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యా భర్తలు పిల్లల కంటే తమ అవసరాలపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగా తమకు సంతానం వద్దనుకుంటున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ సంపాదిస్తూ ఆదాయం పెంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. మారుతున్న జీవన శైలి. లగ్జరీలకు అలవాటు పడడం ఒక కారణమైతే... కరోనా వల్ల ఆదాయం కోల్పోవడం.. ఆర్థికమాంద్యం మరో కారణంగా చెప్పుకోవచ్చు. అయితే జంటలు తీసుకునే ఈ నిర్ణయం పేరే DINK. అంటే Dual Income No Kids. అంటే ఇద్దరూ తమ అవసరాల కోసం జాబ్స్ చేస్తారు. కానీ పిల్లలు కనడంపై వీరు ఆసక్తి చూపరు. ఉన్న లైఫ్‌ని కపుల్స్‌గా, ఆర్థికంగా బలపడేందుకు చూస్తారు కానీ.. ఫ్యామిలీ అంటే పిల్లలు, నెక్స్ట్ జెనరేషన్ అనే థాట్ వారికి ఉండదు. ఒకప్పుడు విదేశాల్లో ఎక్కువగా ఉండే ఈ కల్చర్ ఇప్పుడు ఇండియాకి కూడా వచ్చింది.

తగ్గిపోయిన సంతానోత్పత్తి రేటు

సాధారణంగానే కుటుంబంలో ఇద్దరు సంపాదిస్తుండడం. ఫ్యామిలీ లైఫ్‌కి సరైన సమయం కేటాయించకపోవడం. ఒత్తిడి లాంటి కారణాల వల్ల దేశంలో ఇప్పటికే చాలా మంది సంతానానికి దూరమవుతున్నారు. దీనికి తోడు DINK విధానం ఇండియాలో కూడా పెరుగుతోందని, దీని కారణంగా దేశ సంతానోత్పత్తి రేటు తగ్గిపోయిందని తాజా అధ్యయనం తేల్చింది. లాన్సెట్ సంస్థ చేసిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. అమెరికాలో మార్కెట్ వాచ్ ఈ కల్చర్‌పై సర్వే చేసింది. అక్కడ ఈ నిష్పత్తి 86 శాతం ఉండగా.. వారు పిల్లల కంటే జీవిత లక్ష్యాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని తేలింది. వీరిలో 40 శాతం మంది ఆర్థికంగా స్ట్రాంగ్‌గా ఉండడమే తమకు ముఖ్యమని తెలిపారు. అయితే ఇండియాలో కూడా ఈ నిష్పత్తి బాగానే పెరిగింది. 1950లో భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 6.18 శాతం ఉంటే.. 2021 నాటికి 1.91 శాతానికి ఇది పడిపోయింది.

ఆర్థికప్రభావం వారిపై గట్టిగానే పడింది..

కరోనా, జాబ్స్ లేకపోవడం వంటి కారణాలు.. ప్రభావం చూపించాయి. ద్రవ్యోల్బణం , జాబ్ రెషిషన్స్, ఫినాన్షియల్ ఇబ్బందులు, పెరుగుతున్న రేట్లు మొదలగు అంశాలు.. ఆర్థిక ప్రాధాన్యతను తెలియచేస్తున్నాయి . దీనికి అనుగుణంగా మన దేశంలో కూడా జంటలు పిల్లలపై తమ అభిప్రాయాన్ని మార్చుకుంటున్నారు. అందుకే పిల్లలు కావాలా వద్దా అనే నిర్ణయం వాళ్లే తీసుకుంటున్నారు.

ఆ ఫేజ్‌ని ఎడిట్ చేసేస్తున్నారు..

పిల్లలు ఉంటే వారి చదువులు, పోషణ, లగ్జరీ లైఫ్ వంటి అంశాలను తాము ఎఫర్ట్ చేయగలమా? లేదా అనే ఆలోచనలో పడుతున్నారు ఇప్పటి జంటలు. వారు సంపాదించిన ధనం తమకే సరిపోవట్లేదు కాబట్టి.. పిల్లలు అనే అంశాన్ని వారు ఎడిట్ చేస్తున్నారు. ఉన్నంత కాలం హ్యాపీగా, ఆర్థికంగా స్ట్రాంగ్‌గా ఉందాం.. ఇప్పటికి ఉన్న ఒత్తిడి చాలు.. మరింత ఒత్తిడి వద్దు అనుకునే ఈ నిర్ణయం తీసుకుంటున్నారు.

వ్యతిరేకించేవారు..

స్వాగతించేవారు..

అయితే అమెరికాలో చేసిన ఈ సర్వేలో తేలిన మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏమిటంటే పిల్లలు లేకపోవడం వల్ల దాంపత్య జీవితం మరింత మెరుగ్గా ఉందంటూ వారు తెలిపారు. అయితే ఈ కల్చర్ ఇండియాలో కొందరు స్వాగతిస్తుంటే.. మరికొందరు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అప్పట్లో పిల్లల్నే తమ ఆస్తిగా చెప్పేవారు.. ఇప్పుడు పిల్లలు వద్దు సంపాదనే ముద్దు అంటున్నారంటూ సీరియస్ అవుతున్నారు.



ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

టెస్టుల్లో టాప్ స్కోరర్.. గిల్

సుదీర్ఘ ఫార్మాట్లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఏడాది సెంచరీలతో హోరెత్తించిన టీమిండియా సారథి.. అత్యధిక పరుగులతో అతడు అందరికంటే ముందున్నాడు. అలాగనీ వెయ్యికి పైగా రన్స్ కొట్టలేదు. అయినా కూడా అతడే 2025లో అత్యధిక పరుగుల వీరుల జాబితాలో అగ్రగామిగా నిలిచాడు. టీమిండియా ఆటగాడు కేఎల్ రాహుల్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ రెండో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్సీ చేపట్టిన శుభ్‌మన్ గిల్ నాయకుడిగా మంచి మార్కులు కొట్టేశాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో దంచేసిన గిల్ ఆ తర్వాత వెస్టిండీస్‌పైనా చెలరేగాడు. మొత్తంగా 16 ఇన్నింగ్స్‌ల్లో ఐదు సెంచరీలు, ఒక అర్ధ శతకం బాదిన ఇండియన్ కెప్టెన్.. 70.21 సగటు, 983 పరుగులతో ఈ ఏడాదిని ముగించాడు. 2025లో టెస్టుల్లో అత్యధిక సగటు గిల్‌దే కావడం విశేషం. భారత్‌పై, ఆస్ట్రేలియాపై సెంచరీలతో రికార్డులు నెలకొల్పని జో రూట్ సగటు 57.70 మాత్రమే. యాషెస్ సిరీస్‌లో మెరుపు శతకాలతో ఇంగ్లండ్‌ను నట్టేట ముంచిన ట్రావిస్ హెడ్ 817 రన్స్‌తో రెండో ర్యాంక్ సాధించాడు. టీమిండియాకు ఆపద్బాంధవుడైన కేఎల్ రాహుల్ 813 రన్స్‌తో మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ స్టార్లు జో రూట్ 805 పరుగులతో, హ్యారీ బ్రూక్ 771 పరుగులతో టాప్5లో చోటు దక్కించుకున్నారు. అయితే.. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో మెడకు బంతి తగిలి సిరీస్ మొత్తానికి గిల్ దూరమయ్యాడు. లేదంటే అతడు కచ్చితంగా వెయ్యి పరుగులతో ఈ ఏడాదిని ముగించేవాడు.



59 బంతుల్లోనే సెంచరీ..!

టీ20ల్లో అమేలియా విధ్వంసం..

మహిళల ప్రీమియర్ లీగ్ స్టార్ అమేలియా కేర్ ఫామ్ అందుకుంది. వన్డే ప్రపంచకప్‌లో తేలిపోయిన ఈ ఆల్‌రౌండర్ టీ20ల్లో విధ్వంసక సెంచరీతో కదం తొక్కింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో 59 బంతుల్లోనే శతకంతో మెరిసిందీ స్టార్ బ్యాటర్. పొట్టి ఫార్మాట్‌లో మొదటి శతకంతో ముంబై ఇండియన్స్ అభిమానులను సంబురాల్లో ముంచెత్తింది. మరోవైపు టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న వైట్ ఫెర్న్ సైతం అమేలియా సెంచరీతో హ్యాపీగా ఉంది. స్వదేశంలో జరుగుతున్న విమెన్స్ సూపర్ స్మాష్ లో అమేలియా కేర్ చెలరేగింది. సోమవారం ఆక్లాండ్ హార్ట్స్ బౌలర్లకు చుక్కలు చూపెట్టిన కేర్ బౌండరీలతో విరుచుకుపడింది. 59 బంతుల్లో 17 ఫోర్లు, ఒక సిక్సర్‌తో తను పొట్టి క్రికెట్‌లో తొలి సెంచరీ నమోదు చేసింది. ఓపెనర్ జార్జియా పిమ్మర్ (62)తో తొలి వికెట్‌కు 155 పరుగులు జోడించగా వెల్లింగ్టన్ బ్లేజ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. అనంతరం.. వెల్లింగ్టన్ బౌలర్ల విజృంభణతో ఆక్లాండ్ టీమ్ 135కే పరిమితమైంది. 49 పరుగుల తేడాతో గెలుపొందిన వెల్లింగ్టన్ బ్లేజ్ వరుసగా ఇది రెండో విజయం.

విజయ్ హజారే ట్రోఫీలో మరో మ్యాచ్‌కు కోహ్లీ రెడీ

అంతర్జాతీయ వన్డేల్లో శతకాల కింగ్‌గా అవతరించిన విరాట్ కోహ్లీ అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పాడు. విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీ, అర్ధ శతకంతో మెరిసిన విరాట్.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ సమీపిస్తుండడంతో కీలక నిర్ణయం తీసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మరో మ్యాచ్ ఆడేందుకు రన్ మెషీన్ సిద్ధమవుతున్నాడు. ఈ విషయాన్ని సోమవారం ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ వెల్లడించాడు. దాంతో.. ఈ లీగ్‌లో కోహ్లీ రెండు మ్యాచ్‌లకే పరిమితం అవుతాడనే వార్తలకు చెక్ పడింది. ఆస్ట్రేలియా పర్యటనలో చివరిదైన సిడ్నీ వన్డేతో ఫామ్ అందుకున్న విరాట్ కోహ్లీ పరుగుల వరద కొనసాగిస్తున్నాడు. ఈమధ్యే స్వదేశంలో సఫారీలపై వరుసగా రెండు శతకాలు బాదేసిన విరాట్.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ శతకమోతతో అలరించాడు. రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై 77 పరుగులతో రాణించిన ఈ ఢిల్లీ బ్యాటర్ మళ్లీ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించనున్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ సమీపిస్తున్నందున ప్రాక్టీస్ కోసమని వీహెచ్‌టీలో మరో మ్యాచ్ ఆడేందుకు ఓకే చెప్పాడు. దాంతో.. టీమిండియా స్టార్ పరుగుల విందుకు అభిమానులు రెడీ అవుతున్నారు. 'ఇప్పటికైతే కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. మూడు మ్యాచ్‌లు ఆడుతానని అతడు ఇదివరకే చెప్పాడు' అని రోహన్ జైట్లీ తెలిపాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జనవరి 6న రైల్వేస్‌తో ఢిల్లీ తలపడనుంది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ జనవరి 11న ప్రారంభం కానుంది. పదిహేనేళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడిన కోహ్లీ రెండు మ్యాచుల్లో 131, 77 స్కోర్లతో చెలరేగాడు. తద్వారా లిస్ట్ - ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు.

మెల్‌బోర్న్ పిచ్‌కు ఐసీసీ రేటింగ్

తొలి రోజే 20 వికెట్లు.. మరో రోజు 16 వికెట్లు.. ఐదు రోజులు జరగాల్సిన టెస్ట్ మ్యాచ్ రెండు రోజులకే ముగిసింది. ఇదంతో ఏ మ్యాచ్ గురించో ఇప్పటికే అర్థమై ఉంటుంది గా! యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాఇంగ్లండ్ మధ్య జరిగిన నాలుగో టెస్టు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో బౌలర్ల హవా కొనసాగింది. పిచ్ బౌలర్లకు ఎక్కువగా అనుకూలించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పెర్త్ పిచ్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగినప్పటికీ ఐసీసీ మాత్రం 'వెరీ గుడ్' రేటింగ్ ఇవ్వడంపై క్రికెట్ మాజీలు కూడా అసహనం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మెల్‌బోర్న్ పిచ్‌కు ఐసీసీ రేటింగ్ ఇచ్చింది. 'ఎంసీజీ పిచ్ బౌలర్లకు చాలా అనుకూలంగా ఉంది. మొదటి రోజు 20 వికెట్లు, రెండో రోజు 16 వికెట్లు పడ్డాయి. ఒక్క బ్యాటర్ కూడా కనీసం అర్ధ శతకం చేయలేకపోయాడు. ఈ పిచ్‌కు 'అసంతృప్తికరం' అని రేటింగ్ ఇస్తున్నాం. మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియానికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాం' అని మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ తెలిపారు. ఐసీసీ పిచ్ రేటింగ్ వ్యవస్థలో 'వెరీ గుడ్', సంతృప్తికరం, అసంతృప్తికరం, అన్‌ఫిట్ అనే నాలుగు కేటగిరీలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. గత మూడు బాక్సింగ్ డే టెస్టులకు ఎంసీజీ 'వెరీ గుడ్' రేటింగ్ పొందడం గమనార్హం.

'పెద్ది' నుంచి జగపతి బాబు ఫస్ట్ లుక్ రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని గర్వంగా సమర్పిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అద్భుతమైన నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'పెద్ది' ఒక అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించబోతోంది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అప్పలసూరి పాత్రలో జగపతి బాబును పరిచయం చేస్తూ చిత్ర బృందం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.ఈ పోస్టర్‌లో జగపతి బాబు ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇది సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి పర్ఫెక్ట్ యాప్ట్. చెదిరిన సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు మును పెన్నడూ చూడని అవతార్‌లో కనిపిస్తూ,తన రఫ్ లుక్‌కు మరింత వన్నె తెచ్చారు. దారంతో కట్టిన విరిగిన కళ్లద్దాలు ఆ పాత్ర యొక్క కఠినమైన వ్యక్తిత్వాన్ని, అప్పలసూరి పాత్ర డెప్త్‌ని ఇంటెన్స్‌గా ప్రజెంట్ చేశాయి.తన పాత్రల విషయంలో ఎంతో సెలెక్టివ్‌గా వ్యవహరించే సీనియర్ నటుడు బోమన్ ఇరానీ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర కోసం జాయిన్ అయ్యారు. ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొన్న ఆయన పాత్ర కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా ఉండనుంది. పెద్దిలో ప్రతి క్యారెక్టర్‌కీ ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు డిజైన్ చేసిన నేపథ్యంలో, బోమన్ ఇరానీ పాత్ర కూడా సినిమాకు కీలకంగా ఉండబోతోంది

జనవరి 1వ తేదీన రానున్న 'సఃకుటుంబానాం'

హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్‌పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ కు సోషల్ మీడియా ద్వారా మంచి ప్రశంసలు వచ్చాయి. కొద్ది రోజుల క్రితం ప్రేక్షకుల ముందుకు రానున్న "సఃకుటుంబానాం" చిత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల చిత్ర విడుదల వాయిదా పడగా ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా 2026 జనవరి 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. 2026 సంవత్సరంలో అందరి జీవితాలు మరింత వెలుగు పొందాలని ప్రేక్షకులకు న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ "సఃకుటుంబానాం" చిత్ర బృందం నూతన సంవత్సర సందర్భంగా జనవరి 1వ తేదీన ఈ చిత్రం విడుదల కానందుని తెలిపారు.

అదిరిందయ్యా 'రాజాసాబ్..'

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న క్షణం వచ్చేసింది. యంగ్ రెబల్ స్టార్ నటిస్తున్న 'ది రాజా సాబ్' రిలీజ్ ట్రైలర్ విడుదలై, సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. 'డార్లింగ్' తర్వాత ప్రభాస్‌ను ఫుల్ ఫన్ మోడ్‌లో చూసేందుకు వెయిట్ చేసిన అభిమానులకు ఈ ట్రైలర్ నిజంగా ఫుల్ ట్రీట్ ఇచ్చిందనే చెప్పాలి. ట్రైలర్ "నానమ్మ... ఈ ప్రపంచంలో నీకు అన్నీ మర్చిపోయే రోగం ఉన్నా, ఆయన్ను మాత్రం అస్సలు మర్చిపోలేవు" అనే ప్రభాస్ డైలాగ్‌తో మొదలవుతూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది నానమ్మ - మనవడి కథ అని ప్రభాస్ ఇప్పటికే వెల్లడించగా, ట్రైలర్‌లో కూడా అదే ఎమోషన్ బలంగా కనిపిస్తోంది. అద్భుతమైన విజువల్స్, ప్రభాస్ వింటేజ్ లుక్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఇప్పటివరకూ చూడని స్టైల్‌లో ప్రభాస్ కనిపించడమే కాకుండా, ఆయనను పవర్‌ఫుల్ ఆత్మ ఆవహించినప్పుడు ఎలా ఉంటుందో కూడా ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. కథ విషయానికి వస్తే... తన తాత వారసత్వాన్ని చూసుకునే క్రమంలో రాజా సాబ్ ఓ రహస్యమైన రాజభవనంలోకి అడుగుపెడతాడు. "ఈ ఇల్లు ఓ మయసభ... ఇక్కడికి రావడమే కానీ వెళ్లాలంటే మీ తాత సంతకం కావాలి" అనే డైలాగ్‌తోనే ఆ భవనం ఎంత ప్రమాదకరమో చెప్పకనే చెప్పారు. నానమ్మ కోరిక నెరవేర్చాలనే తపనతో రాజా సాబ్ తన స్నేహితులతో కలిసి భవనంలోకి వెళ్లినా, అక్కడ దాగి ఉన్న భయానక శక్తిని అంచనా వేయలేకపోతాడు. ఆ భవనంలోకి అడుగుపెట్టిన ప్రతీ వ్యక్తి రాజా సాబ్ తాత మాయలో చిక్కుకుని అదృశ్యమవుతాడు. భయంకరమైన ప్రేతశక్తితో చెలరేగుతున్న తాతయ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటనేది సస్పెన్స్‌గా మిగిలింది. ట్రైలర్‌లో ఫ్లాష్‌బ్యాక్‌లో దేవనగర సంస్థానం, మహారాణి గంగాదేవి అలియాస్ గంగమ్మ పాత్రను పవర్‌ఫుల్‌గా చూపించడం కథపై ఆసక్తిని మరింత పెంచింది. అసలు ఆ మయసభలాంటి భవనానికి రాజా సాబ్‌కు సంబంధం ఏమిటి? దేవనగర సంస్థానం నుంచి గంగమ్మ ఎలా దూరమైంది? రాజా సాబ్ తాత గతం ఏంటి? రాజా సాబ్‌కు వ్యతిరేకంగా అతని తాత ఎందుకు ఎదురు తిరుగుతాడు? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే జనవరి 9 వరకు ఆగాల్సిందే. తాజా ట్రైలర్‌లో హారర్ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్ ఫన్ టైమింగ్‌ను కూడా కాస్త చూపించారు. దాదాపు మూడేళ్లుగా ఎదురుచూస్తున్న డార్లింగ్ ఫ్యాన్స్‌కు ఈ సంక్రాంతికి ఫుల్ ట్రీట్ ఖాయం అనే సంకేతాన్ని 'ది రాజా సాబ్' ట్రైలర్ స్పష్టంగా ఇచ్చింది.

'సైక్ సిద్ధార్థ' సినిమాని రూ.99 టికెట్ ధరతో చూడండి

నిర్మాత డి. సురేశ్ బాబు

యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్‌స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థ లో హై ఎనర్జీ ఎంటర్‌టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జనవరి 1న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమాలకి ముఖ్యంగా చిన్న సినిమాలకి ఆడియన్స్ థియేటర్స్ కి రావడం తగ్గిపోతుందని తరుచు మాట్లాడుతుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలని ఆడియన్స్ చాలా అద్భుతంగా థియేటర్స్ లో ఆదరిస్తున్నారు. రాజు వెడ్స్ రాంబాయి లిటిల్ హార్ట్స్ లాంటి కొన్ని సినిమాల్లో వస్తున్నాయి. అలాగే ఇతర భాషల్లో కూడా చిన్న సినిమాలు అద్భుతాలు చేస్తున్నాయి. చిన్న సినిమాలపై హోప్ అయితే ఉంది. ఈ సినిమాని సపోర్ట్ చేయడానికి కారణం డైరెక్టర్ వరుణ్ సినిమాని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశాడు. సినిమాని చూసిన వెంటనే తీసుకోమని చెప్పాను. చాలా ఇంట్రెస్టింగ్ గా సినిమా తీశారు. సినిమా బాగుంటే ఆడియన్స్ కచ్చితంగా చూస్తున్నారు. అలాగే టికెట్ రేట్స్ కూడా మేము దృష్టిలో పెట్టుకుంటున్నాము. ఈ సినిమా టికెట్ కేవలం 99 రూపాయలు మాత్రమే. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200